


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 72 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఎన్.టి.ఆర్ జిల్లా గురువారం 26 మార్చి 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 72 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : NTR DIST, THU 26 MARCH 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur

## ఇరాన్‌పై 15,000 బాంబులు వేశాం...
## 3 వేల లక్ష్యాలపై దాడులు

- యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఈ బాంబులు వేశామని వెల్లడి
- గత జూన్ సంఘర్షణ కాలం నాటితో పోలిస్తే నాలుగు రెట్లు బాంబులు వేశామని వెల్లడి
- ప్రకటించిన ఇజ్రాయెల్ మంత్రి కాట్జ్



**పెన్ పవర్ డెస్క్:**యుద్ధం ప్రారంభమైన ఫిబ్రవరి 28వ తేదీ నుంచి ఇరాన్‌పై 15,000 బాంబులు వేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ మేరకు మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ మాట్లాడుతూ, గత ఏడాది జూన్ నెలతో పోలిస్తే నాలుగు రెట్లు ఎక్కువ బాంబులు వేశామని తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీన ఇరాన్‌పై అమెరికాతో కలిసి ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన విషయం తెలిసిందే. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి తమ సైన్యం 15 వేల బాంబులను ఇరాన్‌పై ప్రయోగించిందని కాట్జ్ వెల్లడించారు. గత ఏడాది జూన్‌లో 12 రోజుల పాటు జరిగిన సంఘర్షణ సమయంలో కంటే నాలుగురెట్లు బాంబులు ఉపయోగించినట్లు తెలిపారు.

- మిగతా2లో

## ఎల్పీజీ పేరుతో అదనపు ఛార్జీ వసూలు చేయొద్దు
## హెటళ్లు, రెస్టారెంట్లకు కేంద్ర ప్రభుత్వం హెచ్చరిక

- ఎల్పీజీ గ్యాస్ కొరతపేరుతో అదనపు చార్జీలు వసూలు చేస్తున్నాయన్న సీసీపీఏ
- హెల్ప్ లైన్ నెంబర్లకు ఫిర్యాదులు, మీడియాలో కథనాలు వచ్చినట్లు వెల్లడి
- అదనంగా ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామన్న కేంద్రం

- మిగతా2లో



## పర్యాటకుల కోసం హోటల్ గదులు,
# హోమ్ స్టేలను పెంచండి

- పర్యాటక శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- పర్యాటకులు మరింత పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలన్న ముఖ్యమంత్రి
- కారావాన్ పార్కులు, టెంట్ సిటీల ఏర్పాటుకు చర్యలు
- పర్యాటక ప్రోత్సాహకానికి సీఎస్ అధ్యక్షతన కమిటీ



**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలో పెరుగుతోన్న పర్యాటకుల ఫుట్ ఫాల్‌కు అనుగుణంగా హోటల్ గదులు, హోం స్టేలను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యాటక శాఖకు దిశానిర్దేశం చేశారు. 2029 నాటికి రాష్ట్రంలో 50 వేల హోటల్ గదుల నిర్మాణం లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. అలాగే వివిధ పర్యాటక ప్రాంతాల్లో 10 వేలకు పైగా హోం స్టేలు కూడా అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. హోంస్టేలను అందుబాటు లోకి తీసుకువచ్చే అంశంపై ఎలాంటి పరిమితీ లేదని వివరించారు.క్యాంపు కార్యాలయంలో బుధవారం పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షకు మంత్రి కందుల దుర్గేష్, ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ సహా పర్యాటక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో ఆమోదం తెలియజేసిన టూరిజం ప్రాజెక్టులు వేగంగా ఏర్పాటు అయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రాంతాలు, నగరాల్లో జాతీయ, అంతర్జాతీయ హోటల్ బ్రాండ్లు వచ్చేలా చూడాలని సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి కూడా రాజమహేంద్రవరం సహా వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హోం స్టేల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. హోం స్టేల నిర్వహణకు సంబంధించి రేటింగ్ కూడా పెట్టాలని దిశానిర్దేశం చేశారు. అరకు, చింతపల్లి, ముంచింగిపుట్టు, గాంధీవనం, మారేడుమిల్లి తదితర ప్రాంతాలతో పాటు కనీసం 10-15 ప్రాంతాల్లో కారావాన్ పార్కులను ఏర్పాటు చేయాలని సూచించారు.కారావాన్లను పార్కింగ్ చేసుకుని కుటుంబంతో సురక్షితంగా ప్రకృతిని ఆస్వాదించేలా ఆయా పార్కుల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఎక్స్ పీరియన్స్ కేంద్రాల వద్ద కూడా ఈ తరహా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. తిరుపతి, విశాఖలలో అమ్యూజ్ మెంట్ పార్కుల ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సీఎం సూచనలు జారీ చేశారు.

అటవీ, దేవాదాయ శాఖల సమన్వయంతో ఎకో, టెంపుల్ టూరిజానికి ప్రోత్సాహం ఇచ్చేలా ప్రాజెక్టులు చేపట్టాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రసాద్, స్వదేశ్ దర్శన్ పథకాల కింద వివిధ దేవాలయాలు, దర్శనీయ స్థలాల అభివృద్ధికి చేపట్టిన ప్రాజెక్టులను 2026 మే నాటికి సిద్ధం చేయాలని అన్నారు. దీనికి సంబంధించి మరో రూ.663 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్టు పర్యాటక శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

- మిగతా2లో

## చంద్రబాబుకు
# భయపడొద్దు..
## ఆ రోజులు పోయాయి: జగన్

- అద్దంకి నియోజకవర్గ వైసీపీ నేతలతో జగన్ సమావేశం
- ప్రతి విషయంలో క్రెడిట్ చోరీ చేస్తున్నారని విమర్శ
- మిట్టల్ స్టీల్ ప్లాంట్ మన హయాంలోనే రాష్ట్రానికి వచ్చిందని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ అధినేత జగన్ ప్రకాశం జిల్లా అద్దంకి నియోజ కవర్గ పార్టీ నేతలతో కీలక సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై, ముఖ్యంగా సీఎం చంద్రబాబుపై ఆయన నిప్పులు చెరిగారు. పాలనలో అంతా తనదే అన్నట్టుగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని, ప్రతి చిన్న విషయంలో 'క్రెడిట్ చోరీ' చేస్తున్నారని మండిపడ్డారు.ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ మన హయాంలోనే రాష్ట్రానికి వచ్చిందని, కానీ ఇప్పుడు తన వల్లే వచ్చినట్టుగా చంద్రబాబు 'బిల్డప్' ఇస్తున్నారని జగన్ ఎద్దేవా

- మిగతా2లో





## జగన్ జీవితం జంగిల్
## బుక్ లాంటిది

- అరాచకం, అబద్ధాలే తప్పించి వాస్తవాలు ఏనాడూ మాట్లాడలేదని విమర్శ
- అసెంబ్లీకి రాకుండా బయట విమర్శలు చేయడం జగన్ బలహీనతకు నిదర్శనమని వ్యాఖ్య
- వేగంగా జరుగుతున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమం చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని ఆగ్రహం

- మిగతా2లో

## అమరావతి 'ఐకానిక్' టవర్లు రెడీ అవుతున్నాయి..
### డయాగ్రిడ్ టెక్నాలజీతో అద్భుత నిర్మాణం



- అమరావతిలో వేగం పుంజుకున్న ఐకానిక్ టవర్ల పనులు
- హెచ్ఓడీ టవర్-3 వద్ద 'కార్నర్ నోడ్' అమర్చే పనులను ప్రారంభించిన నారాయణ
- అమరావతి నిర్మాణానికి ప్రజల పన్నుల నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయడం లేదని వెల్లడి

- మిగతా2లో

## ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్‌తో
## ఏపీ పర్యాటక శాఖ ఎంఓయూ

- ముఖ్యమంత్రి సమక్షంలో కుదిరిన చారిత్రాత్మక ఒప్పందం
- తెలుగు రుచులను ప్రపంచానికి పరిచయం చేయడంలో వర్సిటీ సహకారం
- ఏపీని కలినరీ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడానికి దోహదపడనున్న ఎంఓయూ

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ను కలినరీ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ తిరుపతిలోని ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ తో అవగాహనా ఒప్పందం చేసుకుంది. ముఖ్యమంత్రి

- మిగతా2లో



## 'వందేమాతరం' పాడటం
## తప్పనిసరి కాదు



- 'వందేమాతరం' సర్క్యులర్‌ను సవాలు చేసిన పిటిషన్ కొట్టివేత
- ఆదేశాలు కేవలం సలహా మాత్రమేనని, తప్పనిసరి కాదని చెప్పిన సుప్రీంకోర్టు
- ప్రభుత్వ సర్క్యులర్‌లో శిక్షార్హమైన చర్యలు లేవని స్పష్టం చేసిన ధర్మాసనం
- పరోక్ష ఒత్తిడి ఉంటుందన్న పిటిషనర్ వాదనలు ఊహాజనితమన్న కోర్టు
- దేశభక్తిని బలవంతం చేయలేరని వాదించిన సీనియర్ న్యాయవాది

- మిగతా 2లో




### భాగ్యనగరంలో ప్రయాణికులకు
## ఆర్టీసీ శుభవార్త

- మెట్రో, ఏసీ డీలక్స్ బస్సుల్లో 30 శాతం రాయితీ
- పెట్రోల్, డీజిల్ కొరత నేపథ్యంలో ప్రయాణికులకు ఊరట
- ఆర్టీసీ బస్సులు ఉండగా పెట్రోల్ కష్టాలు దండుగ అంటూ ఆర్టీసీ ఎండీ ఆసక్తికర వ్యాఖ్య

- మిగతా2లో

## అమెరికా విమాన వాహకనౌక
## లక్ష్యంగా క్షిపణి దాడులు చేశాం
### హెచ్చరించిన ఇరాన్ ప్రకటన

- యూఎస్ఎస్ అబ్రహం లింకన్ లక్ష్యంగా ఇరాన్ క్రూయిజ్ క్షిపణితో దాడి
- విమాన వాహన నౌక కదలికలను పరిశీలిస్తున్నామని అంతకుముందే ఇరాన్ ప్రకటన
- ఆ తర్వాత గంటలోపు క్షిపణితో దాడి చేసిన ఇరాన్

- మిగతా2లో



## ఎడిటర్ వ్యూ

### యూరియాపై పశ్చిమాసియా ప్రభావం

రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి యూరియా నిల్వలు తగినంతగా ఉన్నాయని, వ్యవసాయానికి ఎలాంటి ఆటంకం ఏర్పడదని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ పరిస్థితులు అనూహ్యంగా ఉంటున్నాయి. మార్చి 10 నాటికి భారత్‌లో యూరియా నిల్వలు 61.5 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉన్నాయని, అంటే గత ఏడాది ఇదే సమయంలో ఉండే నిల్వల కన్నా 10 లక్షల టన్నుల వరకు అధికంగా ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం ప్రపంచ వాణిజ్యాన్ని అల్లకల్లోలం చేస్తోం ది. ఈ సంక్షోభం వ్యవసాయానికి ప్రధాన అవసరమైన యూరియా తయారీకి కావలసిన లిక్విఫైడ్ నేచరల్ గ్యాస్ (ద్రవీకృత సహజవాయువుఎల్ఎన్‌జి) సరఫరాపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. యుద్ధం ప్రకంపనలు ఇప్పటికే భారత్ యూరియా సరఫరాను దెబ్బతీస్తున్నాయి. ఆదివారం (మార్చి 22) నాటికి భారత్ లోని యూరియా ప్లాంట్లు సగం సామర్థ్యంతో నడుస్తున్న పరిస్థితి ఏర్పడింది. కొన్ని యూరియా కంపెనీలు ప్లాంట్లను మూసివేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. భారత్ అతిపెద్ద ఎల్ఎన్‌జి దిగుమతిదారైన పెట్రోనెట్ ఎల్ఎన్‌జి సంస్థ ఖతార్ నుండి దీర్ఘకాలిక ఒప్పందాల ద్వారా గ్యాస్ సరఫరాను నిర్వహించడం పరిపాటిగా వస్తోంది. ఇటీవల ఖతార్‌లోని రాస్‌లాఫాన్‌లో యుద్ధంవల్ల గ్యాస్ సరఫరా వ్యవస్థకు నష్టం జరగడంతో ఒప్పందం ప్రకారం సరఫరా చేయలేనని పెట్రోనెట్ చేతులుఎత్తేసింది. ఈ చర్య కేంద్ర ప్రభుత్వ యాజమాన్యం లోని గెయిల్ (ఇండియా), ఇండియా ఆయిల్ కార్పొరేషన్ సంస్థ, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ వంటి గ్యాస్ పంపిణీదారుల ద్వారా సరఫరా కోతకు దారి తీసింది. ఎల్ఎన్‌జి సరఫరా కోసం భారత్ భారీగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. భారత్ రోజూ 4.7 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును, అంటే తన అవసరాల్లో 88%, అలాగే 47% సహజవాయు డిమాండ్ కోసం ద్రవీకృత సహజవాయువును విదేశాలనుంచి దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల ప్రపంచ మార్కెట్‌లో యూరియా ధరలు పెరగడమే కాకుండా ఎరువులపై భారత ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలపై కూడా ప్రభావంపడే అవకాశం కనిపిస్తోంది. యూరియా కొరతవల్ల వ్యవసాయ ఉత్పాదక ఖర్చులు పెరగడమే కాకుండా ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉంది. 2025లో అంతర్జాతీయ మార్కెట్ నుంచి 50% పైగా సహజవాయువు (ఎల్ఎన్‌జి)ను భారత్ దిగుమతి చేసుకుంది.

ప్రపంచం మొత్తంమీద భారీస్థాయిలో ఎల్ఎన్‌జి నాలుగో కొనుగోలుదారు భారత్‌యే. 2025లో 261 లక్షల మెట్రిక్ టన్నుల ఎల్ఎన్‌జిని భారత్ దిగుమతి చేసుకుంది. ఇందులో 40% ఖతార్ నుంచి మిగతా 20% యుఎఇ, ఒమన్ ద్వారా సరఫరా అవుతుంది. ఈ ఎల్ఎన్‌జి అంతా హోర్ముజ్ జలసంధి ద్వారానే నౌకల మీదుగా రవాణా అవుతుంది. మొత్తం మీద భారత్ దిగుమతి చేసుకునే ఎల్ఎన్‌జి 60% వరకు హోర్ముజ్ జలసంధి మూసివేయడంవల్ల అంతరాయం ఏర్పడుతోంది. భారత్‌లో అమోనియా తయారీకి తద్వారా ఎరువుల తయారీకి ప్రధానంగా సహజవాయువునే వినియోగిస్తుంటారు. 2026లో భారత్‌కు సరఫరా అయిన ఎల్ఎన్‌జిలో 30% ఎరువుల తయారీకే వినియోగం కావడం గమనార్హం. యూరియా ఉత్పత్తికి ఎల్ఎన్‌జి ప్రధాన వనరు. దేశంలో ఎరువులుగా యూరియానే ఎక్కువగా వాడుతుంటారు. యూరియా ఉత్పత్తి అత్యంత ఇంధన వినియోగతో కూడిన ప్రక్రియ. ఈ యూరియా ప్లాంట్లు తక్కువ ఉద్గారాలను విడుదల చేసే సహజవాయువు వినియోగంలోకి మారాయి. జాతీయ స్థాయిలో యూరియా వినియోగం గత దశాబ్దకాలంలో క్రమంగా పెరిగి 2025లో 387 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగింది. 2025లో స్వదేశీ యూరియా ఉత్పత్తి కూడా దాదాపు 306 లక్షల మెట్రిక్ టన్నుల వరకు జరిగినా దేశం మొత్తం మీద డిమాండ్‌ను నెరవేర్చలేకపోతోంది. అందువల్ల భారత్ యూరియా దిగుమతులపై ఆధారపడవలసి వస్తోంది. ఈ నేపథ్యంలో పశ్చిమాసియాలో యుద్ధ బీభత్సం స్వదేశీ యూరియా ఉత్పత్తిని, సరఫరాను దెబ్బతీస్తోంది. 2025లో భారత్ యూరియా దిగుమతులు 2300 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉన్నాయి. ఈ దిగుమతుల్లో 71% పశ్చిమాసియా నుంచి రావలసి ఉండగా, ఇందులో 45% ఒమన్, సౌదీఅరేబియా, ఖతార్, యుఎఇ నుంచి సరఫరా అవుతుంటాయి. ఈ మొత్తం సరఫరా హోర్ముజ్ జలసంధిద్వారా రవాణా కావలసి ఉంది. ఈ నేపథ్యంలో సహజవాయువు సరఫరా నియంత్రణ ఉత్తర్వు 2026ను భారత ప్రభుత్వం జారీ చేసింది. ఇందులో ఎరువుల రంగాన్ని ప్రాధాన్యత జాబితాలో చేర్చింది. రెండు మూడేళ్ల క్రితం ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించినప్పుడు కూడా ఇంధనం, ఎరువుల సరఫరా విషయంలో కూడా భారత్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. ఎరువుల తయారీకి ప్రాధాన్యం ఇచ్చి స్వదేశీయంగా సబ్సిడీ ధరకు గ్యాస్ లభిస్తేనే ఎరువులు ఉత్పత్తి అవుతాయి. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం వల్ల కూడా పొటాష్ సరఫరా దెబ్బతింది. ప్రపంచ దేశాలకు సరఫరా అయ్యే యూరియాలో 14% ఒక్క రష్యా నుంచే సరఫరా అవుతోంది. డిఎపిలో రష్యా సరఫరా దాదాపు 10% వాటాతో రెండో ఉత్పత్తిదారుగా రష్యా ఉంటోం ది. పొటాష్‌లో కావలసినవి 50% రష్యా, బెలారస్ నుంచే రప్పించుకోక తప్పదు. భారత్ డిఎపి డిమాండ్‌లో దాదాపు 60% చైనా, సౌదీఅరేబియా నుంచే లభిస్తోంది. ఇప్పుడు సౌదీఅరేబియా కూడా యుద్ధ బాధిత దేశంగా ఉండడంతో డిఎపి సరఫరా దెబ్బతింటోంది. భారతదేశానికి సరఫరాలో ఇబ్బందులే కాకుండా దిగుమతుల వ్యయం బిల్లుకూడా అమాంతంగా పెరిగే ప్రమాదం ఏర్పడే పరిస్థితి ఉందని వాణిజ్యవర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

# పర్యాటకుల కోసం హోటల్ గదులు, హోమ్ స్టేలను పెంచండి

- మొదటి పేజి తరువాయి

గండికోట, సూర్యలంక, అరకు బొర్రా గుహలు తదితర ప్రాంతాలను ప్రముఖ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలన్నారు. గోదావరి పుష్కరఘాట్‌ను ఆగస్టు నాటికి, హేవ్ లాక్ బ్రిడ్జిపైకి పర్యాటకులను అనుమతించేలా ఈ ఏడాది డిసెంబరు నాటికి పనులు పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు.

**పర్యాటక ప్రోత్సాహానికి సీఎస్ అధ్యక్షతన కమిటీ**

రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా ఓ బోర్డు లేదా కమిటీ ఏర్పాటు చేసి ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. పర్యాటకశాఖ, అటవీ, దేవాదాయ, పోలీసు, మెరైన్ ఇలా వేర్వేరు శాఖల సమన్వయం కోసం సీఎస్ అధ్యక్షతన దీనిని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. హౌస్ బూట్లు, హెలీ టూరిజంతో పాటు ఉడాన్ పథకం కింద సీ ప్లేన్‌లను కూడా ప్రోత్సహించాలని అన్నారు. విశాఖ, విజయవాడ, శ్రీశైలం, గండికోట, కంభం చెరువు లాంటి చోట్ల వాటర్ ఏరో డ్రోమ్స్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించాలని సూచించారు. సముద్ర విహారాన్ని ప్రోత్సహించేలా విశాఖ, నెల్లూరులోని కృష్ణపట్నం పోర్టుల నుంచి క్రూజ్ నౌకలను కూడా నిర్వహించేలా చూడాలన్నారు. తెలంగాణా లాంటి ల్యాండ్ లాక్డ్ రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు దీనికి పెద్ద ఎత్తున ఆకర్షితులు అవుతారన్నారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసే టెంట్ సిటీలను కేటగిరీలుగా విభజించి ప్రోత్సహిస్తే అందరికీ అందుబాటులోకి వస్తాయన్నారు. కనీసం వెయ్యి టెంట్ సిటీలను గోదావరి పుష్కరాల నాటికి అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి సూచనలు జారీ చేశారు. క్రియేటివ్ ఎకనామినీ ప్రోత్సహించేందుకు కంటెంట్ క్రియేషన్ పెద్ద ఎత్తున జరగాలన్నారు. క్రియేటివ్ ఎకానమీని సృష్టించేలా అమరావతి క్రియేటివ్ సిటీగా ఎదగాలన్నారు.

బాలివుడ్ స్టార్ సంజయ్ దత్ కూడా క్రియేటివ్ ఎకనామీ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపించారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఐకానిక్ డెస్టినేషన్ స్కీమ్ కింద విశాఖ, తిరుపతి నగరాలను అభివృద్ధి చేయాలని.. ప్రతీ ఐకానిక్ డెస్టినేషన్ కు రూ.500 కోట్ల వరకూ వెచ్చించేందుకు ఆస్కారం ఉందని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. గత ఏడాదిలో పర్యాటక ప్రాంతాలకు 30.92 కోట్ల మంది పర్యాటకుల ఫుట్ ఫాల్ నమోదైందని, ఈ ఏడాదిలో 9 నెలల కాలానికి గానూ 21 శాతం మేర వృద్ధి కనిపించిందని, ఇది మరింత పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన ఆలయాలను అనుసంధానించి టెంపుల్ టూరిజం కూడా ఇంటిగ్రేట్ చేయాలని సీఎం సూచించారు. సూర్యలంక బీచ్‌ను ప్రత్యేకంగా అభివృద్ధి చేసేందుకు యాక్షన్ ప్లాన్ చేపట్టాలన్నారు. వీటితో పాటు తిరుపతిలో ఉన్న చెరువులు, అమరావతి ప్రాంతంలోని కాలువలు, విశాఖ సహా వేర్వేరు ప్రాంతాలను సుందరీకరణ చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## ఎల్పీజీ పేరుతో అదనపు ఛార్జీ వసూలు చేయొద్దు

### హెటళ్లు, రెస్టారెంట్లకు కేంద్ర ప్రభుత్వం హెచ్చరిక

హోటళ్లు, రెస్టారెంట్లకు కేంద్ర ప్రభుత్వం కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఎల్పీజీ పేరుతో అదనపు చార్జీలు వసూలు చేయకూడదని స్పష్టం చేసింది. గ్యాస్ కొరతను చూపిస్తూ అదనపు సేవల ఛార్జీ వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీ (సీసీపీఏ) హెచ్చరించింది. దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ కొరత పేరుతో కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సీసీపీఏ స్పందించింది. ఎల్పీజీ గ్యాస్ పేరుతో కొన్నిహోటళ్లు, రెస్టారెంట్లు వినియోగదారుల నుంచి అదనంగా ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి

వచ్చినట్లు తెలిపింది. హెల్ప్ లైన్ నెంబర్లకు ఫిర్యాదులు వచ్చాయని, మీడియాలో కూడా వార్తలు వచ్చాయని వెల్లడించింది. మెనూలో పేర్కొన్న ధరలను మాత్రమే వసూలు చేయాలని, అదనంగా ఎలాంటి చార్జీలు ఉండకూడదని స్పష్టం చేసింది.

## జగన్ జీవితం జంగిల్ బుక్ లాంటిది

వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి జీవితం 'జంగిల్ బుక్'లా మారిందని ఆంధ్రప్రదేశ్ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి విమర్శించారు. అరాచకం, అబద్ధాలు తప్పించి వాస్తవాలను ఏనాడూ మాట్లాడని నాయకత్వం ఆయనదేనని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల పాలనలో అవినీతి, అక్రమాలు, ప్రజా ధనం దోపిడీ చేసి రాష్ట్రాన్ని దెబ్బతీశాడని ఆరోపించారు. అందుకే ప్రజలు ఆయనకు గట్టి బుద్ధి చెప్పి కేవలం 11 అసెంబ్లీ సీట్లకే పరిమితం చేశారని అన్నారు. ప్రజా తీర్పును గౌరవించకుండా, అసెంబ్లీకి రాకుండా బయట విమర్శలు చేయడం ఆయన బలహీనతకు నిదర్శనమని అన్నారు. గతంలో ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్, హెచ్‌ఎస్‌బీసీ, ఐబీఎం వంటి ప్రముఖ కంపెనీలను రాష్ట్రం నుంచి తరిమేసింది నాటి జగన్ ప్రభుత్వమేనని అన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఆ పరిస్థితులను మార్చి గూగుల్, టీసీఎస్, అర్సెలార్ మిట్టల్, కాగ్నిజెంట్, ఐబీఎం వంటి ప్రతిష్ఠా త్మక సంస్థలను రాష్ట్రానికి తీసుకువస్తోందని పేర్కొన్నారు. ఇది తమ ప్రభుత్వంపై పెట్టుబడిదారుల్లో ఉన్న నమ్మకానికి నిదర్శనమని మంత్రి అన్నారు. జగన్ పాలనలో చేసిన ఆర్థిక విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని బయటకు తీసుకురావడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తూ పెట్టుబడులకు స్వర్గధామిగా ఆంధ్రప్రదేశ్‌ను నిలుపుతోందని అన్నారు. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, యువతకు లభిస్తున్న ఉపాధి అవకాశాలు, వేగంగా జరుగుతున్న అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సంక్షేమాన్ని చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. అందుకే ప్రతిసారి గుమ్మం కూడా దాటకుండా ఇంట్లో ప్రెస్ మీట్ ద్వారా లేదా తన పార్టీ నేతలతో సమావేశమై కూటమి ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకొని పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు, దుష్ప్రచారాలు చేసినా ప్రజలు తమ ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసాన్ని ఏమాత్రం దెబ్బతీయలేరని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం దృఢంగా ముందుకు సాగుతుందని జనార్ధన్ రెడ్డి అన్నారు.

## అమరావతి 'ఐకానిక్' టవర్లు రెడీ అవుతున్నాయి..

రాజధాని అమరావతిలో రాష్ట్ర స్థాయి అధికారులందరూ ఒకే చోట కొలువుదీరేలా నిర్మిస్తున్న ఐదు ఐకానిక్ టవర్ల పనులు వేగవంతమయ్యాయి. ఈరోజు హెచ్ఓడీ టవర్-3 వద్ద 'కార్నర్ నోడ్' అమర్చే పనులను మంత్రి నారాయణ ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అత్యాధునిక డయాగ్రిడ్ సాంకేతికతతో ఈ భవనాలను నిర్మిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అమరావతి నిర్మాణానికి ప్రజలు చెల్లించే పన్నుల నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయడం లేదని మంత్రి స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు రూపొందించిన ప్రత్యేక ఫైనాన్స్ మోడల్ ద్వారానే ఈ నిధులు సమకూరుతున్నాయని, అమరావతి ఒక 'సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ' అని ఆయన గుర్తు చేశారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాల వల్ల సుమారు 4 నెలల పాటు పనులకు అంతరాయం కలిగిందని, ఇప్పుడు పనుల వేగాన్ని పెంచామని తెలిపారు. ఐకానిక్ భవనాలతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారుల నివాస సముదాయాల పనులు కూడా తుది దశకు చేరుకున్నాయని వివరించారు.

రాయపూడి వద్ద జరిగిన అగ్నిప్రమాదంపై సీఎం ఇప్పటికే సమీక్షించారని, ఒకవేళ ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఈ ప్రమాదానికి పాల్పడి ఉంటే వారిపై కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ప్రస్తుతం దీనిపై పూర్తిస్థాయి విచారణ జరుగుతోందని చెప్పారు.

**డయాగ్రిడ్ టెక్నాలజీ అంటే ఏమిటి?**

ఈ టవర్ల నిర్మాణంలో వాడుతున్న డయాగ్రిడ్ టెక్నాలజీ వల్ల భవనానికి లోపల పిల్లర్లు ఉండాల్సిన అవసరం తక్కువగా ఉంటుంది. దీనివల్ల లోపల స్థలం ఎక్కువగా లభిస్తుంది. ఉక్కును త్రిభుజాకారపు గ్రిడ్లుగా అమర్చడం వల్ల భవనానికి అద్భుతమైన పటుత్వంతో పాటు ఒక ఆధునిక లుక్ వస్తుంది.

## 'వందేమాతరం' పాడటం తప్పనిసరి కాదు

ప్రభుత్వ, అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయం 'వందేమాతరం' పాడాలంటూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆ సర్క్యులర్ కేవలం సలహా పూర్వకమైనదే తప్ప, తప్పనిసరి కాదని స్పష్టం చేసింది. అందులో ఎలాంటి శిక్షార్హమైన చర్యలు పేర్కొననందున, ఈ పిటిషన్‌పై విచారణ తొందరపాటు అవుతుందని అభిప్రాయపడింది. భారత ప్రధాన న్యాయమూర్తి (CJI) సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం. పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ ఏడాది జనవరి 28న కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్ కేవలం సలహా మాత్రమేనని, దాన్ని పాటించకపోతే శిక్షలు ఉంటాయని ఎక్కడా చెప్పలేదని ధర్మాసనం పేర్కొంది. "ఒకవేళ శిక్షార్హమైన చర్యలు తీసుకుంటే లేదా దీన్ని తప్పనిసరి చేస్తే అప్పుడు విచారిస్తాం. ప్రస్తుతానికి ఇందులో అలాంటివేమీ లేవు" అని కోర్టు వ్యాఖ్యానించింది.

పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే, సర్క్యులర్‌లో శిక్షలు లేకపోయినా ఇది పరోక్ష ఒత్తిడికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వందేమాతరం పాడటానికి లేదా గౌరవ సూచకంగా నిలబడటానికి నిరాకరించే వారు సామాజిక వివక్షను ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆయన వాదించారు. "దేశభక్తిని బలవంతంగా రుద్దలేరు. వ్యక్తిగత అంతరాత్మను కాపాడాల్సిన బాధ్యత రాజ్యాంగంపై ఉంది" అని ఆయన నివేదించారు.

అయితే, పిటిషనర్ వ్యక్తం చేస్తున్న ఆందోళనలు ప్రస్తుతానికి ఊహాజనితమేనని ధర్మాసనం అభిప్రాయపడింది. ఒకవేళ ఎవరిపైనైనా శిక్షార్హమైన చర్యలు తీసుకున్నా లేదా వివక్ష చూపినా, అప్పుడు మళ్లీ కోర్టును ఆశ్రయించవచ్చని సూచిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. విద్యాసంస్థలు, బహిరంగ సభల్లో వందేమాతరం పాడాలని కేంద్రం సర్క్యులర్‌లో సూచించింది. ఇది కేవలం జాతీయ గేయంపై గౌరవాన్ని పెంపొందించడానికేనని,

చట్టబద్ధంగా అమలు చేయాలనే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. వందేమాతరం స్ఫూర్తి గురించి ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభలో ప్రస్తావించడం గమనార్హం. బంకించంద్ర చటోపాధ్యాయ 1875లో రచించిన ఈ గేయం, స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలను ఏకతాటిపై నడిపించిందని కొనియాడారు. రవీంద్రనాథ్ ఠాగూర్ స్వరపరిచిన ఈ గీతాన్ని 1896లో కాంగ్రెస్ సమావేశంలో తొలిసారి ఆలపించారు. 1950లో అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ దీనికి జాతీయ గేయం హోదా కల్పించారు.

## ఇరాన్‌పై 15,000 బాంబులు వేశాం... 3 వేల లక్ష్యాలపై దాడులు

- మొదటి పేజి తరువాయి

ఇరాన్‌లోని 3,000 లక్ష్యాలపై దాడులు చేసినట్లు తెలిపారు. అయితే ఇరాన్‌పై దాడిని ఐదు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు రోజుల క్రితం సంచలన ప్రకటన చేశారు. ఈ ప్రకటనతో తమకు సంబంధం లేదని ఇజ్రాయెల్ చెబుతోంది.

## చంద్రబాబుకు భయపడొద్దు..

- మొదటి పేజి తరువాయి

చేశారు. గూగుల్ విషయంలోనూ ఇదే జరిగిందని, మాటలు కోటలు దాటుతున్నా చేతల్లో ఏమీ లేదని విమర్శించారు. రాబోయే రోజుల్లో పార్టీని సరికొత్తగా తీర్చిదిద్దుతామని, 'జగన్ 2.0'లో కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు. నేతలెవరూ చంద్రబాబును చూసి భయపడాల్సిన అవసరం లేదని, ఆ రోజులు పోయాయని ధైర్యం చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజన జరగబోతుండటం పార్టీకి మంచి పరిణామమని జగన్ అభిప్రాయపడ్డారు. దీనివల్ల మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని, గతంలో తాము పదవులు, కాంట్రాక్టుల్లో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చామని, ఇప్పుడు చట్టసభల్లో కూడా మన మహిళలకు మరిన్ని అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు.

## భాగ్యనగరంలో ప్రయాణికులకు ఆర్టీసీ శుభవార్త

భాగ్యనగరంలో ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ శుభవార్త చెప్పింది. హైదరాబాద్ నగర పరిధిలోని మెట్రో, ఏసీ డీలక్స్ బస్సుల్లో 30 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. పెట్రోల్, డీజిల్ కొరత వార్తల నేపథ్యంలో ప్రయాణికులకు ఆర్టీసీ ఊరటనిచ్చే వార్త చెప్పింది.

ఈ సందర్భంగా ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి స్పందిస్తూ, "పెట్రోల్ కష్టాలు పడటం ఎందుకు దండగ, ఆర్టీసీ బస్సులు ఉండగ" అంటూ వ్యాఖ్యానించారు. పెట్రోల్ బంకుల వద్ద ప్రజలు బారులు తీరవద్దని, సురక్షితంగా బస్సులోనే ప్రయాణించాలని సూచించారు.

## అమెరికా విమాన వాహకనౌక లక్ష్యంగా క్షిపణి దాడులు చేశాం

ఇరాన్‌పై దాడులను ఐదు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ప్రకటించిన రెండు రోజుల అనంతరం, అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. అగ్రరాజ్యం అమెరికాకు చెందిన విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్ లక్ష్యంగా ఇరాన్ క్రూయిజ్ క్షిపణితో దాడులు చేసింది. ఈ మేరకు ఇరాన్ ప్రభుత్వం ప్రకటన చేసింది. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ విమాన వాహక నౌక వైపు తాము క్రూయిజ్ క్షిపణిని ప్రయోగించామని ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ప్రసారం చేసింది. దీనిని అమెరికా ధృవీకరించవలసి ఉంది. ఈ విమాన వాహక నౌక కదలికలను నిరంతరం పరిశీలిస్తున్నామని, దానిని లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. ఆ తర్వాత గంటలోపు క్షిపణి దాడి జరగడం గమనార్హం. ఇందుకు సంబంధించిన వీడియోను ఇరాన్ మీడియా విడుదల చేసింది. అబ్రహం లింకన్‌పై దాడి చేశామని ఇరాన్ ఇదివరకు కూడా ప్రకటించింది. తమ బాలిస్టిక్ క్షిపణులు ఈ నౌకను ఢీకొట్టాయని, దీనితో అది పని చేయడం లేదని, గల్ఫ్ జలాల నుంచి వెనక్కి తగ్గిందని ఇటీవల ఇరాన్ ప్రకటించగా, అమెరికా తోసిపుచ్చింది.

## ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్‌తో ఏపీ పర్యాటక శాఖ ఎంఓయూ

- మొదటి పేజి తరువాయి

చంద్రబాబునాయుడు సమక్షంలో ఈ కీలకమైన ఎంఓయూ కుదిరింది. ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు-ఏపీ పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్‌లు ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. తెలుగు రుచులను, వంటకాలను ప్రపంచానికి పరిచయం చేయటంతో పాటు ప్రాంతీయ ఆహార సంస్కృతిని చాటి చెప్పేలా ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ సహకారం అందించనుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌ను కలినరీ టూరిజానికి ఓ కీలకమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు వీలుగా ఈ ఎంఓయూ తోడ్పడనుంది. ప్రత్యేకించి కలినరీ విభాగంలో నైపుణ్యాభివృద్ధి కల్పన, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ నిర్వహించే ఫుడ్ ఫెస్టివల్స్, టూరిజం ఈవెంట్లను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తెలుగు వంటకాల రుచులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలియచేసేలా కార్యాచరణ చేపట్టనున్నారు. ఈ అవగాహనా ఒప్పందం కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఏపీ హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా . ఎన్.టి.ఆర్. జిల్లా . గుంటూరు జిల్లా . పల్నాడు జిల్లా . బాపట్ల జిల్లా

# బాలికల రక్షణ - బాలల హింసా రహిత గ్రామ రూపకల్పనే మా లక్ష్యం..







పెన్ పవర్, గుంటూరు, మార్చి, 25. గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ సిస్టర్ నీరజ ఆద్వర్యంలోబుధవారం ఉదయం తాడేపల్లి మండలం ప్రాతూరు గ్రామ సచివాలయం నందు గ్రామ స్థాయి బాలల రక్షణ, పరిరక్షణా చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ఏర్పాటు చేయటం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ సిస్టర్ నీరజ మాట్లాడుతూ బాలబాలికల రక్షణ,వారి అభివృద్ధి కోసం పని చేయుటలో మా సంస్థ ఎప్పుడు ముందుంటుందని తాడేపల్లి మండలం తో పాటు మంగళగిరి,పెదకాకాని, తుళ్ళూరు ఈ నాలుగు మండలాలలో కూడా బాలల హక్కుల గురించి, కిశోర బాలికలకు బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి, సమాజం లో ఆడపిల్లల పై జరిగే లైంగిక దాడులు, వేధింపుల నుండి రక్షించ బడటానికి ప్రభుత్వం నుండి అందుతున్న సేవలు , చట్టాల గురించి ముక్యంగా ఈ రోజులలో చిన్నపెద్దా తేడా లేకుండా తెలియకుండా అందరూ మోస గించబడుతూ ఆర్థికంగా నష్ట పోతున్నటువంటి సైబర్ దాడుల గురించి చైతన్యం కల్పిస్తున్నాం అని మన తాడేపల్లి మండలం లోని 11 గ్రామాలలో మా సంస్థ ముక్యంగా పిల్లల కోసం పని చేస్తున్నాం అని ఈరోజు మన ప్రాతూరు గ్రామంలో బాలల రక్షణ కమిటీ ఏర్పాటు చేయటం ఈ మంచి కార్యక్రమానికి మీరందరూ కలిసి రావటం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.తర్వాత గ్రామ సచివాలయం సెక్రటరీ జే.అశోక్ కుమార్ మాట్లాడుతూ సమాజ భవిష్యత్తు తరాల నిర్మాణ, రేపటి తరం పౌరులైన బాలల అభివృద్ధి కోసం ఇలాంటి ఒక కమిటీ ఏర్పాటు చేయటం చాలా మంచి ఉద్దేశం ఇందులో ప్రభుత్వాన్ని కూడా కలుపుకొని పోవటం అనే ఆలోచన చాలా మంచి విషయం అని మన ప్రాతూరు గ్రామంలోని పిల్లల కోసం గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ తో పాటు మనమందరం కలసి ఈ కమిటీలో సభ్యులుగా ఉండి మన గ్రామాన్ని బాలల హింసా రహిత, బాలల స్నేహ గ్రామంగా. తయారు చేద్దాం అని ప్రతిజ్ఞ చేయించటం జరిగినది. తరువాత అత్తోట పోతురాజు సంస్థ సిబ్బంది మాట్లాడుతూ సమాజంలో ఎక్కువగా నిర్లక్ష్యానికి, హింసకు,దోపిడికి గురయ్యేది పిల్లలే అటువంటి పిల్లల ప్రాథమిక హక్కులు పొందుకోలేక పోవటానికి ఉన్న ప్రతీ అడ్డంకి తొలగించాలని సమాజంలో పిల్లల పాత్ర సంక్లిష్టమైనది అయినా సమాజం లో పెద్దల సామూహిక నిర్ణయం ద్వారా ఏ పనిఅయిన జరుగుతుంది అని అయినప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పిల్లలు మరియు యువత సమాజంలో చురుకైన భాగస్వాములుగా ఉండాలనే మరియు తమ గొంతును వినిపించాలనే తమ కోరికను ప్రదర్శిస్తూనే ఉండాలనేదే మా సంస్థ యొక్క ముఖ్య లక్ష్యం అని సమాజ భవిష్యత్తుకైనా పిల్లలే అత్యంత కీలకమైన వనరు, వారి శ్రేయస్సు, అభివృద్ధి మరియు విద్య అనేవి సమాజాలు, దేశాల గమనాన్ని నిర్దేశించే ప్రాథమిక ప్రాధాన్యతలు అని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ పెద్దలు అరవపల్లి శ్రీనివాస్ హాజరై చాలా మంచి కార్యక్రమం పిల్లల కోసం మీరు మీ సంస్థ ద్వారా చేస్తున్నది అని మా సహాయ సహకారం ఎప్పుడూ ఉంటుంది అని నూతన గ్రామ బాలల సరక్షణ కమిటిని అభినందించారు ఈ కార్యక్రమంలో సచివాలయం,హెల్త్ డిపార్ట్ మెంట్,గ్రామ పెద్దలు అంగన్వాడీ టీచర్స్ ,గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంధ సంస్థ సిబ్బంది అత్తోట పోతురాజు పెద్దిపాగ అనిల్ కుమార్, సచివాలయంసిబ్బంది స్థానిక ఆషా వర్కర్స్ పాల్గొన్నారు....

# శ్రీరామ ఉత్సవ సమితి వారి ఆధ్వర్యంలో శ్రీరామ నవమి శోభాయాత్ర....




పెన్ పవర్, గుంటూరు, మార్చి, 25. గత ఎనిమిది సంవత్సరాలుగా గుంటూరు నగరంలో శ్రీరామనవమి నాడు శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వహిస్తున్నామని ఎప్పటి లాగే ఈ ఏడాది తొమ్మిదవ సంవత్సరం బృందావన గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుండి ఈ యాత్ర మొదలవుతుందన్నారు. గుంటూరు నగరంలో ఉన్న ప్రముఖ దేవాలయాల మీదుగా ఈ యాత్ర సాగుతుందని శ్రీరామనవమి రోజున ఉదయం 9 గంటలకు మొదలయ్యే శ్రీరామ నవమి శోభాయాత్ర బృందావన్ గార్డెన్స్, పట్టాభిపురం, నగరంపాలెం,హిందూ కాలేజ్, హనుమాన్ సెంటర్, బస్టాండ్ రోడ్,పాత గుంటూరు హనుమాన్ దేవాలయం,జెండా టవర్ కన్యకా పరమేశ్వరి అమ్మవారి టెంపుల్,చివరగా రామనామ క్షేత్రం చేరటంతో ముగుస్తుందని ఆయన తెలిపారు. ఈ శోభాయాత్రలో ముఖ్యఅతిథిగా తెలంగాణ మెదక్ జిల్లా ఎంపీ రఘునందన్ మరియు గుంటూరు తాళ్లయ్య పాలెం పీఠాధిపతి శివ స్వామి గుంటూరు నగరంలో ఉన్న హనుమాన్ భక్తులు మరియు రామభక్తులు,హిందూ కార్యకర్తలు పాల్గొంటారని.. గుంటూరు నగరంలో ఉన్న హిందువులు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితిధ్యక్షులు కారంచేట్టి లోకేష్ గుప్తా మరియు సమితి సభ్యులు వేణుగోపాల్, చల్లా బ్రహ్మ రెడ్డి, ఫణింద్ర, జానకి,మహేష్ ప్రవీణ్, లక్ష్మను, మధు, సుబ్బారావు, చరణ్ ,అంకారావు, పాల్గొన్నారు...

# కృష్ణ ఫార్మర్స్ కోపరేటివ్ సొసైటీ సర్వసభ్యసమావేశం... కెడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం..





పెన్ పవర్, విజయవాడ, మార్చి, 25. కృష్ణా ఫార్మర్స్ కోపరేటివ్ సొసైటీ ఆవరణలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆధునికీకరించిన కృష్ణ ఫార్మర్స్ సొసైటీ భవనాన్ని ఆయన ఘనంగా ప్రారంభించారు. భవనంలో చేపట్టిన ఆధునికరణ పనులను పరిశీలించిన నెట్టెం రఘురాం , సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా రైతులకు మరింత సమర్థవంతమైన సేవలు అందించే దిశగా తీసుకున్న ఈ చర్యలను అభినందించారు. ముఖ్యంగా ఈ పనులను సమర్థవంతంగా అమలు చేసిన సొసైటీ చైర్మన్ యానాల గోపీచంద్ ని ప్రశంసించారు.

ఈ సందర్భంగా 2021--22, 2022--23, 2023--24 సంవత్సరాలకు సంబంధించిన డివిడెండ్లను మొత్తం 2,926 మంది సభ్యులకు రూ.49,27,420లను పంపిణీ చేశారు. సమావేశంలో సంఘ ఆడిట్ నివేదికను ఆమోదించగా, సంఘం ఆర్థికంగా ప్రగతి పథంలో దూసుకెళ్తోందని చైర్మన్ యానాల గోపీచంద్ వివరించారు.

నెట్టెం రఘురాం మాట్లాడుతూ, 2025--26 ఆర్థిక సంవత్సరంలో సంఘం రూ.1.36 కోట్లు లాభాలు సాధించిందని తెలిపారు. ఇప్పటివరకు రూ.9 కోట్లకు పైగా డిపాజిట్లు సేకరించి, రూ.45 కోట్ల రుణ వ్యాపారాన్ని విజయవంతంగా విస్తరించినట్లు పేర్కొన్నారు. సంఘం సమర్థవంతమైన నిర్వహణకు పాలకవర్గం మరియు సిబ్బందిని అభినందించారు.

రైతులకు సకాలంలో రుణ చెల్లింపులపై వడ్డీ రాయితీ, అకాల మరణం చెందిన రైతు కుటుంబాలకు రూ.1 లక్ష వరకు బీమా, ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.2 లక్షల వరకు కెడీసీసీబీ ద్వారా బీమా సదుపాయం అందిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా, గతంలో రూ.1 లక్ష వరకు ఉన్న వడ్డీ మాఫీ పరిమితిని రూ.3 లక్షలకు పెంచి, అసలు చెల్లించిన రైతులకు పూర్తి వడ్డీ మాఫీని 60:40 నిష్పత్తిలో బ్యాంకు మరియు సంఘం భరిస్తాయని ప్రకటించారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, అన్నదాత సుఖీభవ వంటి పథకాల ద్వారా రైతులకు మద్దతు అందిస్తున్నట్లు తెలిపారు. నీటి వినియోగం, డిమాండ్ ఆధారిత పంటలు, ఆధునిక వ్యవసాయ సాంకేతికత, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు ద్వారా రైతులు ఆదాయం పెంచుకోవాలని సూచించారు.

2025లో జరిగిన పునర్వ్యవస్థీకరణలో

గంద్రాయి సంఘాన్ని ముక్త్యాల సహకార సంఘంలో విలీనం చేయగా, సభ్యుల అభ్యర్థన మేరకు తిరిగి విభజన చేయాలని సర్వసభ్య సమావేశం తీర్మానం ఆమోదించి ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మల్లెల సీతమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు ముల్లంగి రామకృష్ణారెడ్డి, కట్టా వెంకట నరసింహారావు, దూళిపాళ్ల లక్ష్మణరావు, మాజీ అధ్యక్షులు వెలమాటి చంద్రమౌళి, రైతు ప్రతినిధులు కొట్టారు సత్యనారాయణ ప్రసాద్, గడ్డం హుస్సేన్, మాజీ జడ్పిటిసి అమ్మనబోయిన రాణి, కెనాల్ చైర్మన్ కానూరు కిషోర్, దర్శి విజయ నరసింహారావు, కస్మర్తి శ్రీనివాసరావు, సర్పంచ్ మైనేని రాధాకృష్ణ, కెడీసీసీ బ్యాంక్ సిబ్బంది, సంఘ సీఈఓ నారాయణరావు మరియు 13 గ్రామాలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణా ఫార్మర్స్ కోపరేటివ్ సొసైటీని ఆధునికీకరణ దిశగా ముందుకు తీసుకెళ్తూ రైతులకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో సంఘం ముందడుగు వేస్తోందని, కెడీసీసీబీ ద్వారా శ్రీ నెట్టెం రఘురాం గారి నాయకత్వంలో రైతులకు నాణ్యమైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని అన్ని సొసైటీ చైర్మన్లు పేర్కొన్నారు...

# రాష్ట్ర ఆదాయం పెంచి, ప్రజలకు పంచాలన్నదే చంద్రబాబు ఆలోచన : ప్రత్తిపాటి

**పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తల్లో చంద్రబాబుపై ఉన్న నమ్మకమే పెట్టుబడుల ఆకర్షణలో ఏపీని అగ్రస్థానంలో నిలుపుతోంది.**

**పెట్టుబడుల ఆదాయంతోనే ప్రజలకు లబ్ధి.. రాష్ట్రాభివృద్ధి.**

**సుగాలీ కాలనీలో రూ.45 లక్షలతో నిర్మించే కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి.**





చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 25 : చిలకలూరిపేట : రాష్ట్ర ఆదాయం పెంచి, ప్రజలకు పంచాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన అని, చంద్రబాబు నాయకత్వంపై పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తల్లో ఉన్న అపారమైన నమ్మకమే పెట్టుబడుల ఆకర్షణలో ఏపీని అగ్రస్థానంలో నిలుపుతోందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని సుగాలీ కాలనీలో రూ.45 లక్షలతో నిర్మించ తలపెట్టిన సామాజిక భవనం (కమ్యూనిటీ హాల్) నిర్మాణానికి కూటమినాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పెట్టుబడుల ఆదాయంతోనే ప్రజలకు లబ్ధి.. రాష్ట్రాభివృద్ధి స్వల్పకాలంలో రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు రావడం వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ల శ్రమ, కృషి ఎంతో ఉందన్న ప్రత్తిపాటి, కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలు కూడా ఇందుకు దోహదం చేస్తున్నాయన్నారు. 20 నెలల్లో 25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, వాటి యొక్క ఒప్పందాలు వేగంగా కార్యరూపం దాలుస్తున్నాయని ప్రత్తిపాటి చెప్పారు. పెట్టుబడులు గ్రౌండ్ అయ్యాక ప్రభుత్వానికి వచ్చే ఆదాయంతోనే ప్రజలకు లబ్ధి, రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. దాంతోపాటే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విరివిగా లభిస్తాయని, దీంతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలో సంతోషం వస్తుందని ప్రత్తిపాటి తెలిపారు.

కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, ఎస్టీ సేల్ నాయకులు వడితే అంజి నాయక్, మోతి భాయి, గోవింద నాయక్, రాములు నాయక్, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి, డి.ఈ షేక్ రియాజ్ ఉద్దీన్, ఏ.ఈ వి సుజనా అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా పారిశ్రామికవేత్తలకు అండగా రైజ్' సెంటర్... ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా




పెన్ పవర్,విజయవాడ, మార్చి, 25. మహిళలను కేవలం గృహిణులుగా కాకుండా, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో నోవాటెల్ హోటల్ లో నిర్వహించిన 'విమెన్ హుడ్' కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీ షా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాలను పారిశ్రామిక దిశగా నడిపించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ముఖ్యంగా 'ఒక కుటుంబం – ఒక పారిశ్రామికవేత్త' అనే కాన్సెప్ట్‌లో భాగంగా మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. నీతి ఆయోగ్ గణాంకాల ప్రకారం దేశంలో మహిళా పారిశ్రామికవేత్తల సంఖ్య మెరుగుపడాల్సి ఉందని, ఆంధ్రప్రదేశ్‌లో ఈ పరిస్థితి చాలా ఆశాజనకంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. గ్రామీణ మహిళల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు 'రైజ్' సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. కొత్తగా వ్యాపారం ప్రారంభించాలనుకునే మహిళలకు ఎటువంటి ముందస్తు అనుభవం లేకపోయినా, కేవలం ఆలోచనతో వస్తే చాలని, వారికి అవసరమైన శిక్షణ, మార్కెటింగ్ మెళకువలు మరియు సాంకేతిక సహకారాన్ని ఈ సెంటర్ల ద్వారా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు కోసం నీతి ఆయోగ్ నుండి రూ. 1.5 కోట్ల నిధులు మంజూరయ్యాయని, జిల్లా వ్యాప్తంగా ఈ కేంద్రాలను విస్తరిస్తామని ఆయన తెలిపారు. ఫిక్కీ ఫ్లో వంటి సంస్థల సహకారంతో విజయవాడను మహిళా పారిశ్రామికవేత్తల హబ్‌గా మారుస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఇన్నర్ వీల్ ఇంటర్నేషనల్ మాజీ కోశాధికారి సరిత లునాని మాట్లాడుతూ మహిళలు స్వభావరీత్యా బహుముఖ ప్రజ్ఞాశాలలని వారు లేనిదే ఈ సృష్టి మనుగడ సాధ్యం కాదని అన్నారు. పురాణాల కాలం నుండి నేటి ఆధునిక యుగం వరకు మహిళల ప్రాముఖ్యత అపారమని కొనియాడారు. హిందూ మతంలో శివ–పార్వతులు, రామ–సీత, విష్ణు–లక్ష్మి వంటి దైవ శక్తులు కూడా మహిళా శక్తితో ముడిపడి ఉన్నాయని ఆమె గుర్తు చేశారు. పురుషులు సంపాదనలో, కుటుంబ పోషణలో మంచి పాత్ర పోషించినప్పటికీ, ఒక మహిళా చేసే బహుముఖ పనులను వారు చేయలేరని ఆమె అభిప్రాయపడ్డారు. తదనంతరం ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ చైర్ పర్సన్ అమ్రిత కుమార్ మాట్లాడుతూ సమాజాభివృద్ధికి,మహిళాభివృద్ధికి తమ చాప్టర్ ఎంతగానో కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను కలెక్టర్ లక్ష్మీ షా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సతీమణి సుప్రిత, ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ సీనియర్ చైర్ పర్సన్ సుప్రియ మలినేని,దీప్తి చలసాని, తులజ , దుర్గా సౌజన్య తదితరులు పాల్గొన్నారు...

# వేగవంతమైన పన్ను వసూళ్లు

**వడ్డీ రాయితీతో పన్ను చెల్లించడానికి 6 రోజులే గడువు....కమిషనర్ కె.మయూర్ అశోక్...**




పెన్ పవర్, గుంటూరు, మార్చి, 25. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఏక మొత్తంగా చెల్లించే ఆస్తిపన్నుపై వడ్డీ రాయితీని నగర ప్రజలు విరివిగా వినియోగించుకుంటున్నారని తెల్పిన కమిషనర్. బుధవారం ఒక్కరోజే రూ.2.55 కోట్లు పన్ను చెల్లించారన్న కమిషనర్. పెద్ద మొత్తంలో బకాయి ఉన్న వారిని డిప్యూటీ కమిషనర్లు నేరుగా కలిసి పన్ను చెల్లించేలా తెలియచేయాలని, స్పందించకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసిన కమిషనర్. అడ్మిన్ కార్యదర్శులు మార్చి నెల ముగింపుకు వచ్చినందున పూర్తి స్థాయిలో విధుల్లో ఉండాలని, నిర్లక్ష్యంగా ఉండే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక. ట్యాక్స్ కలెక్షన్ కేంద్రాలు కూడా ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు పని చేస్తాయని, నగర ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరిన కమిషనర్...

# సేంద్రీయ సాగు విధానాలతోనే అధిక లాభాలు : ప్రత్తిపాటి

## కాస్త కష్టంగా అనిపించినా భవిష్యత్ లో మంచి ఫలితాలనిచ్చేది సేంద్రీయ వ్యవసాయమే.
## ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేయకుండే ప్రజల భూములు మాయం.
## చంద్రబాబు నాయకత్వం శాశ్వతమైనప్పుడే రాష్ట్రానికి, ప్రజలకు మేలు.
## ప్రభుత్వ, రైతుల సంయుక్త ఆర్థిక సహకారంతోనే లిఫ్టుల ఆధునికీకరణ.
## రూ. 4 కోట్లతో కాలువ డ్రాపుల పునర్నిర్మాణం.. కొత్త షట్టర్ల ఏర్పాటు.
## రైతన్నా మీకోసం -- అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో మాజీమంత్రి

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 25 : చిలకలూరిపేట : సేంద్రియ సాగు ఉత్పత్తులకు బహిరంగ మార్కెట్లో మంచి గిరాకీ ఉంటుందని, రసాయన ఎరువుల వాడకానికి అలవాటుపడిన రైతులు.. ఒక్కసారిగా సహజ విధానాల్లో సాగు చేపట్టడం కాస్త కష్టంగానే ఉంటుందని, కానీ భవిష్యత్ లోమంచి ఫలితాలు, అధిక లాభాలు రావాలంటే మారక తప్పదని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. నాదెండ్ల మండల కేంద్రంలో 30 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఎంపీడీవో కార్యాలయ దగ్గర ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన 'రైతన్నా మీకోసం -- అన్నదాతా సుఖీభవ' బహిరంగసభలో ప్రత్తిపాటి మాట్లాడారు.

కూటమి ప్రభుత్వం.. ముఖ్యమంత్రి చేసే ప్రతి ఆలోచన.. ప్రతి పనిలో ప్రజాహితమే దాగి ఉందనే నిజాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కువెళ్లిందని, ప్రభుత్వ భూములతో పాటు, ప్రజల భూములు కాజేయడానికి నాటి పాలకులు ప్రయత్నించారని ప్రత్తిపాటి చెప్పారు. జగన్ తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను చంద్రబాబు రద్దు చేయకుంటే.. ప్రజల భూములు రాత్రికి రాత్రే మాయమయ్యేవన్నారు. ఆర్థిక సమస్యలున్నా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమం అందించడంలో కూటమి ప్రభుత్వం ఎక్కడా వెనక్కు తగ్గడం లేదన్నారు. చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి శాశ్వతంగా ఉన్నప్పుడే ఏపీ, అభివృద్ధిలో దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు. ప్రజలు ఎల్లప్పుడూ ఇంటా బయటా సంతోషంగా ఉండాలన్నదే చంద్రబాబు ఆలోచనని, ఆయన పనితీరుకు తగినట్టుగా ప్రజలు కూడా తమ ఆలోచనా ధృక్పథం మార్చుకోవాలని ప్రత్తిపాటి హితవు పలికారు. కూటమిప్రభుత్వం సంక్షేమ పథకాలపై లబ్ధిదారులు చేసే విస్తృత ప్రచారమే ప్రజల్లో నాటుకుపోతుందన్నారు.

30 డ్రాపులపై 30 షట్టర్లు ఏర్పాటుచేస్తున్నాం.. ప్రభుత్వ, రైతుల భాగస్వామ్యంతోనే లిఫ్టుల ఆధునికీకరణ

నియోజకవర్గంలోని సాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు 30 డ్రాపుల్ని కొత్తగా నిర్మించి, వాటిపై కొత్త షట్టర్లను ఏర్పాటు చేస్తున్నామని, అందుకోసం రూ.4 కోట్ల వ్యయంతో త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు ప్రత్తిపాటి చెప్పారు.



అదేవిధంగా నియోజకవర్గంలోని 56 లిఫ్టుల (ఎత్తిపోతల పథకాలు) ఆధునికీకరణ పనులపై ముఖ్యమంత్రితో మాట్లాడటం జరిగిందని, ప్రభుత్వం నుంచి కొంత ఆర్థిక సాయం మంజూరు చేయిస్తామని, రైతులు కొంత సమకూర్చుకొని వాటిని బాగుచేసుకోమని ఆయన సూచించారని ప్రత్తిపాటి చెప్పారు. రూ.10 నుంచి రూ.20 లక్షల్లో బాగయ్యే లిఫ్టులపై రైతాంగం తొలుత శ్రద్ధ పెట్టాలని, అంతకంటే ఎక్కువ ఖర్చయ్యే వాటికి మాత్రం, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేలా చూస్తానని ప్రత్తిపాటి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, సొసైటీ చైర్మన్ నల్లమోతు హరిబాబు, నాయకులు వలేటి హిమవంతరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, గ్రామ నాయకులు యనమదల సూర్య నారాయణ, వేములపల్లి వెంకటేశ్వర్లు, నెల్లూరి కోటేశ్వరరావు, వేములపల్లి బసవయ్య, నెల్లూరి విజయ సారధి, నల్లమోతు అమరేశ్వరరావు, హార్టికల్చర్ అధికారిని శ్రీలక్ష్మి, అగ్రికల్చర్ ఏ.డి.ఎ శ్రీనివాసరావు, ఏవో శ్రీలత, ఎమ్మార్వో, ఎంపీడీవోలు , అధికారులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# నాయకుడిపై ప్రజల విశ్వాసం.. నమ్మకమే వారి భవిష్యత్ ను నిర్ణయిస్తాయి : ప్రత్తిపాటి

## వైసీపీని గెలిపిస్తే ప్రజలకు సక్రమంగా తాగునీరు కూడా అందలేదు.
## టీడీపీ హయాంలో రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తే.. వైసీపీ చిన్న గుంత పూడ్చలేదు.
## కొత్తవారిని నమ్మినందునే చిలకలూరిపేట అభివృద్ధిలో వెనుకబడింది.
## అభివృద్ధిలో మార్పుకోరుకోవాలని కానీ.. నాయకత్వంలో కాదు.
## ఎన్నికలు వచ్చేవరకూ కౌన్సిలర్లు మాజీలు కారు.
## మాజీ కౌన్సిలర్ల సన్మాన సభలో మాజీమంత్రి ప్రత్తిపాటి.

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 25 : చిలకలూరిపేట : ఒక నాయకుడిపై ప్రజలు పెట్టుకునే నమ్మకం, విశ్వాసమే వారి భవిష్యత్ ను నిర్ణయిస్తాయని, దానికి ప్రత్యక్ష ఉదాహరణ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన బాటలో నడిచే ప్రజాప్రతినిధులేనని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అభిప్రాయపడ్డారు. బుధవారం చిలకలూరిపేట పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్ లో మున్సిపాలిటీ విభాగం ఆధ్వర్యంలో జరిగిన మాజీ చైర్మన్, టీడీపీ 18 మంది మాజీ కౌన్సిలర్ల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పదవీ కాలం ముగించుకున్న చైర్మన్, కౌన్సిలర్లతో పాటు, మున్సిపల్ అధికారుల్ని, పట్టణ ప్రముఖులను, మున్సిపల్ సిబ్బందిని సన్మానించిన ప్రత్తిపాటి, అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగించారు.

అభివృద్ధిలో మార్పు కోరుకోవాలి కానీ..నాయకత్వంలో కాదు

చిలకలూరిపేట పట్టణ ప్రజలు అభివృద్ధిలో మార్పు కోరుకోవాలి కానీ, నాయకత్వంలో కాదని, గతంలో చేసిన తప్పు చేయకుండా ఉంటేనే పట్టణప్రజల స్థితిగతులు పూర్తిగా మారిపోతాయని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. 2014-19 మధ్యకాలంలో నియోజకవర్గంలో రూ.4వేలకోట్లకు పైగా అభివృద్ధి పనులు చేసినా ప్రజలు కొత్తవారికి అవకాశమిచ్చి తప్పుచేశారని, దానివల్లే నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకండిందని ఆయన చెప్పారు. ప్రజాసమస్యల గురించి.. నియోజకవర్గం గురించి ఏమీ తెలియనివారిని నమ్మడం, వారిని చేరదీయడం వంటి తప్పులు చేయొద్దని ఈ సందర్భంగా ప్రత్తిపాటి నియోజకవర్గ ప్రజలకు హితవు పలికారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలోనే పట్టణంలో ఎక్కడా మట్టిరోడ్డు అనేది లేకుండా మొత్తం సిమెంట్ రోడ్లు వేయించి, డ్రైనేజ్ లు నిర్మించి, తాగునీరు నిరంతరం అందిచామన్నారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎక్కడా చిన్న గుంత కూడా పూడ్చకుండా ఐదేళ్లు ప్రజల్ని, వారి సమస్యల్ని గాలికి వదిలేసిందన్నారు. చివరకు టీడీపీ ప్రభుత్వంలో రోజూ నీటిసరఫరా చేస్తే. వైసీపీ నాయకులు రెండ్రోజులకు ఒకసారి నీరందించారన్నారు. వారి హయాంలో జరిగినస్థానిక ఎన్నికలు అప్రజాస్వామికంగా జరిగాయని, గెలుపుకోసం దుర్మార్గాలకు పాల్పడ్డారని ప్రత్తిపాటి చెప్పారు.



వైసీపీ దుర్మార్గ పాలనలో ఎన్నో చేదు అనుభవాలను చవిచూసిన ప్రజలు ముందుందు అప్రమత్తంగా వ్యవహరించాలని, అప్పుడే వారిజీవితాలకు, నియోజకవర్గానికి ఎనలేని మేలు కలుగుతుందని ప్రత్తిపాటి తెలిపారు. గత ప్రభుత్వ దుర్మార్గాలను ఎదిరించడంలో నాడు టీడీపీ నుంచి గెలుపొందిన కౌన్సిలర్లు ముందు నిలిచారని, ధైర్యంగా వైసీపీ ప్రభుత్వ దోపిడీపై పోరాడారని ప్రత్తిపాటి ప్రశంసించారు. మరలా స్థానిక ఎన్నికలు జరిగేవరకు ఈ కౌన్సిలర్లు యథావిధిగా ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారు అప్పటివరకు మాజీలు కారని ఆయన తెలిపారు కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, అసిస్ట్ సంస్థ డైరెక్టర్ జాస్తి రంగారావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు బత్తినేని శ్రీనివాసరావు, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, పోట్రూ పూర్ణచంద్రరావు, క్లస్టర్ ఇంచార్జీలు మద్దిబోయిన శివ , ముల్లా కరీముల్లా, షేక్ మస్తాన్ వలి, కొత్త కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు మురకొండ మల్లిబాబు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి, డిఇ అబ్దుల్ రహీమ్, కరెంట్ ఏ.డి.ఈ అశోక్ కుమార్, మాజీ రెవెన్యూ అధికారి చల్లా విజయ్ కుమార్, డాక్టర్లు ముద్దన రమేష్, కొల్లా అమర్, కందిమల్ల వాసుదేవ అంకమ్మ చౌదరి , చిగురుపాటి రామారావు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్ర అభివృద్ధికి స్టీల్ ప్లాంట్ కొత్త మైలురాయి

## మిత్తల్ స్టీల్ ప్లాంట్‌తో ఇండస్ట్రియల్ హబ్‌గా
## మంత్రి లోకేష్ కృషితో భారీ పెట్టుబడి సాధ్యం
## ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 25: ఉత్తరాంధ్ర అభివృద్ధికి దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న భారీ పారిశ్రామిక ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగడం రాష్ట్రానికి గర్వకారణమని, మిత్తల్ స్టీల్‌ప్లాంట్.. ఉత్తరాంధ్రను ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చనుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్––నిప్పాన్ స్టీల్ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న ప్రపంచ స్థాయి సమీకృత ఉక్కు కర్మాగారానికి శంకుస్థాపన కార్యక్రమం పారిశ్రామిక చరిత్రలో కీలక ఘట్టమని పేర్కొన్నారు. రూ.1.35 లక్షల కోట్లకు పైగా పెట్టుబడితో నిర్మితమయ్యే ఈ ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్రాజెక్టులలో ఒకటిగా నిలుస్తుందని ఆయన చెప్పారు. ఈ ప్లాంట్ ద్వారా లక్షకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు సృష్టించబడతాయని, స్థానిక యువతకు దీర్ఘకాలిక ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. మంత్రి నారా లోకేష్ పెట్టుబడిదారులతో నిరంతర చర్చలు జరిపి, వేగవంతమైన అనుమతులు కల్పించడం వల్లే ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు రావడం సాధ్యమైందని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. పారదర్శక విధానాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వంటి సంస్కరణలు పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచాయని అన్నారు. "యువతకు ఉపాధి కల్పననే లక్ష్యంగా 'జాబ్స్ ఫస్ట్' దృక్పథంతో మంత్రి లోకేష్ ముందుకు తీసుకువచ్చిన ప్రాజెక్టు ఇది. ఇది కేవలం ఒక పరిశ్రమ కాదు, ఆంధ్రప్రదేశ్ యువత భవిష్యత్తును మార్చే ఉపాధి యంత్రం," అని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టుతో ఉత్తరాంధ్ర ప్రాంతం వేగంగా ఇండస్ట్రియల్ హబ్‌గా మారుతుందని, పోర్ట్, రహదారి, రైల్వే మౌలిక వసతులు మరింత మెరుగుపడతాయని తెలిపారు. అనుబంధ పరిశ్రమలు, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు కూడా ఈ ప్రాజెక్టు ఊతమిస్తుందని చెప్పారు. విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేసే దిశగా ఈ స్టీల్ ప్లాంట్ కీలక పాత్ర పోషిస్తుందని, రాష్ట్ర జీడీపీ వృద్ధి, పారిశ్రామిక విస్తరణ, పెట్టుబడుల ప్రవాహం పెరగడానికి ఇది దోహదం చేస్తుందని అన్నారు. ఈ ప్రాజెక్టు రెండు దశల్లో పూర్తికానుంది. మొదటి దశలో ఏడాదికి 7.3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్ పనిచేయనుండగా, రెండో దశలో దీన్ని 10.5 మిలియన్ టన్నులకు పెంచనున్నారని,2030 నాటికి తొలి బ్లాస్ట్ ఫర్నేస్ ప్రారంభమవుతుందని అధికారులు



భావిస్తున్నారని తెలిపారు. ఈ స్టీల్ ప్లాంట్‌తో పాటు 50 ఎంటీపీఏ సామర్థ్యంతో క్యాప్టివ్ పోర్టును కూడా ఏర్పాటు చేయనున్నారని,రూ.11,192 కోట్లతో నిర్మించే ఈ పోర్ట్ ద్వారా లాజిస్టిక్స్ రంగానికి భారీ ఊతం లభించడంతో పాటు వేలాది మందికి ఉపాధి అవకాశాలు కలుగనున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న పారిశ్రామిక విధానాల వల్లే ప్రపంచస్థాయి కంపెనీలు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నాయని ఎమ్మెల్యే ఏలూరి అన్నారు. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులపై ఇతరులు క్రెడిట్ తీసుకోవాలని ప్రయత్నించడం దురదృష్టకరమని, అభివృద్ధి కార్యక్రమాలపై రాజకీయాలు చేయడం సరైంది కాదని ఆయన సూచించారు. "రాష్ట్రానికి మేలు జరిగితే అందరూ కలిసి స్వాగతించాలి. కానీ కొందరు రాజకీయ ఈర్ష్యతో అభివృద్ధిని కూడా తక్కువ చేసి చూపేందుకు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే ఏలూరి వ్యాఖ్యానించారు.

# టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని పండుగలా చేద్దాం... ఎమ్మెల్యే నసీర్

పెన్ పవర్, గుంటూరు, మార్చి, 25. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ పండుగకు సిద్ధం కావాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ కేడర్ కు పిలుపునిచ్చారు. ఈ నెల 29వ తేదీన తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం, రేపు 26న బిఆర్ స్టేడియంలో మల్టీపర్పస్ భవన సముదాయాల శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా పార్టీ శ్రేణులతో బుధవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ తెలుగు నేలపై పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందని తెలిపారు. అన్న నందమూరి తారక రామారావు స్ఫూర్తితో సీఎం నారా చంద్రబాబునాయుడు ఆంధ్ర ప్రదేశ్ ను ప్రపంచ పటంలో గొప్ప రాష్ట్రంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించాకే తెలుగు ప్రజలు తలెత్తుకొని నిలబడేలా ఆత్మ గౌరవాన్ని కాపాడినట్లు చెప్పారు. అలాంటి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పండుగలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీఆర్ స్టేడియం అభివృద్ధి కోసం అసెంబ్లీలోనూ ప్రస్తావించానని, ఈ క్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర సహాయం మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో బిఆర్ స్టేడియం అభివృద్ధికి బాటలు వేశామని స్పష్టం చేశారు. ఖేల్ ఇండియా కార్యక్రమంలో



భాగంగా 14 కోట్ల నిధులు మంజూరయ్యాయని, వీటి ద్వారా మల్టీపర్పస్ భవన నిర్మాణాన్ని కేంద్రమంత్రి పెమ్మసాని చేతుల మీదుగా ప్రారంభించబోతున్నామని, ప్రతి ఒక్కరూ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు....

# గృహనిర్మాణం కు ఆర్థిక సాయం అందజేసినబాపట్ల నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడునిజామ్

## పేదలకు ఆసరా గా నిజాం సేవలు అజరామరం
## తుఫాన్ బాధితుడి కి 25000ఆర్థిక సాయం

పిట్ల వానిపాలెం పెన్ పవర్ న్యూస్ చందోలు గ్రామం కు చెందిన హనీఫ్ అనే వ్యక్తి దర్జీ గా జీవనం సాగిస్తున్నారు. గతంలో తుఫాన్ కారణం గా ఆయన గృహం పూర్తిగా ఛిద్రం అయింది. ఆ సమయం లో జీవనాధారం లేక కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. ఆ తరుణం లో బాపట్ల నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు నిజామ్ ఆర్థిక సాయం అందించి నిత్యావసర సరుకులు అందించి తన ఉదర భావం ను చాటాడు. ఇల్లు కోల్పోయిన దర్జీ హనీఫ్కు నేడు ఇంటి నిర్మాణం కు25000రూపాయలు ఆర్థిక సాయం చేశారు. ఇలా పేదలకు అండగా నిలుస్తున్న నిజామ్ సేవలకు ప్రజలు ఫిదా అవుతున్నారు అంటే అతిశయోక్తి కాదు. మనం ఎంత ఎదిగిన ఓదగాలి అనే నినాదం తో అందరూ బాగుండాలి అని సేవలు చేస్తున్నారు నిజామ్. ఆయన సేవలు పలువురికి ఆదర్శంగా మారి పేదలకు సేవచేయాలి అని దృక్పథంతో ముందుకు సాగాలి అని ప్రతి ఒక్కరు కోరుతున్నారు. ఆయన



సేవలకు హర్షం వ్యక్తం చేస్తూ పలువురు కొనియాడుతున్నారు. ఈకార్యక్రమంలోపదవివిరమణచేసినఆర్మీఉద్యోగులు మొహమ్మద్ ఆరిఫ్, యాకుబ్ బేగ్, మొహమ్మద్ సైదా గ్రామస్తులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల గురించి అవగాహన చందోల్ ఎస్సై వెంకట శివకుమార్:

పిట్టల వారి పాలెం పెన్ పవర్ న్యూస్: ప్రజల భద్రత, శాంతి భద్రతల టోల్ గేటు వద్ద ప్రజలకు ప్రముఖ సూచనలు చేశారు. యువత ఏ విధంగానైన డ్రగ్స్, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటివలన శారీరక మానసిక ఆరోగ్యంలో తీవ్ర నష్టం కలుగుతుందని ఆయన హెచ్చరించారు. అలానే గ్రామస్తులు కోడి పందాలు, పేకాటలు ఇతర జూదాలకు సంబంధించిన క్రీడలు ఆడరాదని తెలియపరచనారు. సైబర్ నేరాలు పెరుగుతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరు ఇంటర్నెట్ వినియోగంలో జాగ్రత్తగా ఉండి, అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకూడదని సూచించారు. దొంగతనాలు, చోరీలు జరగకుండా ప్రతి ఇంటి ముందు, వ్యాపార కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు. చిన్నపిల్లల చేత వాహనాలు నడపనివ్వకూడదని స్పష్టం



చేశారు. వాహనాన్ని నడిపే ప్రతి వ్యక్తి చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. రెండు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, తమ భద్రతను నిర్లక్ష్యం చేయకూడదని హెచ్చరించారు. తన ప్రసంగంలో ప్రజలు చట్టాలను పాటించి, సమాజ అభివృద్ధికి భాగస్వాములు కావాలని ఎస్ఐ మర్రి వెంకట శివకుమార్ కోరారు.

# ఆర్థిక సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి : ఎపి స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్

కృష్ణా : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 25: రిటైర్డ్ ఉద్యోగుల హక్కులకు భంగం కలిగించే ఆర్థిక సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలు ధరించి బుధవారం కలక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేసిన ఈ చట్టం ఫలితంగా ప్రభుత్వ పెన్షనర్లు పిఆర్సి డి ఏ తదితర హక్కులు కోల్పోవలసి వస్తుందన్నారు. రాష్ట్ర కార్యదర్శి జిల్లా ప్రధాన కార్యదర్శి చేబ్రోలు ఆశీర్వాదం మాట్లాడుతూ 2025 వ సంవత్సరం మార్చి 25వ తేదీన పార్లమెంటులో ఆమోదించడం విచారకరమన్నారు. ఈ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి రిటైర్డ్ ఉద్యోగులందరూ మార్చి 25వ తేదీ బ్లాక్ డే గా భావిస్తూ నిరసన తెలియజేయడం జరిగిందన్నారు.అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్ర శేఖరావు కు వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు కే ఆదినారాయణ ,జిల్లా కోశాధికారి ఏ శంకరరావు, జిల్లా ఉపాధ్యక్షులు మొవ్వ మండల యూనిట్ అధ్యక్షుడు వివి కఅష్ణారావు, జిల్లా ఉపాధ్యక్షుడు వై దుర్గారావు, జిల్లా కార్యదర్శులు



బి కే దుర్గారావు, ఎం సత్యనారాయణ, పెడన మండల యూనిట్ అధ్యక్షుడు మట్టా రాధాకఅష్ణమూర్తి, అవనిగడ్డ మండల యూనిట్ అధ్యక్షుడు భూపతి భాస్కరరావు, గన్నవరం మండల యూనిట్ అధ్యక్షుడు ఏ మోహన్ రావు, మండల యూనిట్ల కార్యదర్శులు సభ్యులు పాల్గొన్నారు.

# యువత స్వయం ఉపాధి వైపు ఆసక్తి చూపాలి..ఇన కొల్లు పోలీసు రావు

పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 25: యువత స్వయ ఉపాధి కోర్సులు వైపు ఆసక్తి చూపాలి అని కర్లపాలెం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఇనకొల్లు పోలీసు రావు అన్నారు. కర్లపాలెం స్థానిక రామకృష్ణ సేవా సమితిలో కుట్టుమిషన్లు శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక రామకృష్ణ సేవా సమితి వ్యవస్థాపకులు కాటూరి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా ఏపీఎంఓ శ్రీనివాసరావు, పోలీసు రావు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా పోలీసురావు మాట్లాడుతూ స్వయం ఉపాధి ద్వారా మహిళలు వారి జీవన ప్రమాణాన్ని,



ఆదాయాన్ని పెంచుకోవచ్చు అన్నారు ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ గ్రామీణ శాఖ ఆధ్వర్యంలో ఈ కుట్టు మిషన్ శిక్షణ నిర్వహించినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి ప్రతినిధులు చందు పిచ్చయ్య, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంధనానికీ యుద్ధం మంటలు

పిడుగురాళ్ల : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 25: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధ నేపథ్యంలో నెలకొన్న గ్యాస్ కొరత ఇప్పుడు పెట్రోల్, డీజిల్‌కూ అంటుకుంది. ఇంధన కొరత కారణంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆటోలు, ఇతర రవాణా వాహనాలు నిలిచి రవాణా వ్యవస్థ క్రమంగా నిలిచిపోతోంది. పిడుగురాళ్ల పట్టణంలో 5 పెట్రోల్ బంకులు, మండలంలోని హైవే, ప్రధాన రహదారుల వెంటన మరో 5 వరకు పెట్రోల్ బంకులు ఉండగా వీటన్నింటిలోనూ ఇంధన నిల్వలు అంత్యదశకు చేరుకున్నాయి. పిడుగురాళ్లలోని ప్రధాన కూడలి, జయలక్ష్మి సినిహాల్ పక్కన పెట్రోల్ బంకుల్లో ఇప్పటికే అమ్మకాలు నిలిపేపేశారు. దీంతో వాహనదార్లు ఇతర ప్రాంతాల్లోని బంకులకు బళ్లను పరుగులు తీయిస్తున్నారు. పట్టణం నుండి 12 కిలోమీటర్ల దూరంలోని తుమ్మలచెరువు గ్రామంలోని బంకు వద్దకు పలువురు వాహనదార్లు క్యూ కడుతున్నారు. కొన్ని పెట్రోల్ బంకుల వద్ద వాహనాల రద్దీ కారణంగా 40 నిముషాల వరకూ నిరీక్షిస్తున్నారు. మంగళవారం రాత్రి నాటికి చాలాచోట్ల నిల్వలు అయిపోవచ్చుని, బుధవారం నాటికి పిడుగురాళ్ల పరిసర ప్రాంతాల్లోని అన్ని బంకుల్లోనూ ఇంధనం పూర్తిగా అయిపోయే ప్రమాదం ఉందని బంకుల సిబ్బంది హెచ్చరిస్తున్నారు. రావాల్సిన ట్యాంకర్లు సకాలంలో రాకపోవడమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో ఉద్యోగులకు కార్యాలయాలకు, కార్మికులు పనులకు వెళ్లడం కష్టంగా మారగా, వ్యాపార కార్యకలాపాలు కూడా మందగిస్తున్నాయి. డీజిల్ లేని కారణంగా కొండమోడు సెంటర్, ఇతర ప్రాంతాల్లో ఆటోలు కొన్ని బాడుగలకు తిప్పలేక పక్కన ఉంచారు. ఈ పెట్రోల్ కొరత ప్రభావం ప్రస్తుతం జరుగుతున్న పదో తరగతి పరీక్షలపై పడే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు వచ్చే విద్యార్థులు తమ సొంత వాహనాలపైనే ఆధారపడుతున్నందున, పెట్రోల్ అందుబాటులో లేకపోతే సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవడం ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు ఆటోలు, టాక్సీలు నిలిచిపోవడంతో రవాణా చార్జీలు పెరగడమే కాకుండా, సరుకు రవాణా కూడా ఆలస్యమవుతోంది. దీనివల్ల మార్కెట్‌లో నిత్యావసర వస్తువులు,



కూరగాయల ధరలు ఆకాశాన్నంటే ప్రమాదం ఉందని వ్యాపార వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో సామాన్యుడి ఆర్థిక పరిస్థితి దిగజారుతుండగా మరోవైపు రైతులు కూడా వ్యవసాయ పనులకు అవసరమైన వాణాలు, రవాణా సదుపాయాల కోసం అవస్థ పడుతున్నారు. పొలాల్లోని మిర్చి, మొక్కజొన్న పంటల తరలింపు కష్టగా మారుతోంది. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి పెట్రోల్ సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు. అయితే ఇంధన సరఫరా సాధారణ స్థితికి రావడానికి కొంత సమయం పట్టే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.ఇదిలా ఉండగా ఇప్పటికే గ్యాస్ కొరత కారణంగా హోటళు ,, టిఫిన్ సెంటర్లు, తోపుడు బండ్లు, వెల్డింగ్ వర్కర్లు, ఇతర చిన్న పరిశ్రమలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, చిరు వ్యాపారాలు తాత్కాలికంగా మూతబడ్డాయి. వాటిల్లో పనిచేసే వారు ఉపాధిని కోల్పోయారు. పట్టణంలోని గ్యాస్ ఏజెన్సీల వద్ద సిలిండర్ల కోసం ప్రజలు గంటల తరబడి క్యూల్లో నిలబడాల్సి వస్తోంది. ఇళ్లల్లో గ్యాస్ లేక కట్టెల పొయ్యిలు వాడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది గ్యాస్ సిలిండర్‌ను బ్లాక్ మార్కెట్‌లో రూ.2000-2500 వరకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

# కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన

చల్లపల్లి (కృష్ణా) : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 25: చల్లపల్లి మండలం కొత్తమాజేరు పల్లెపాలెంలో బుధవారం నూతన కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపట్టారు. గ్రామానికి చెందిన హైదరాబాద్ నివాసి మాజేటి భీమ శంకరరావు చొరవతో తెలంగాణ రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఎంపీ లాడ్స్ నిధులు రూ.30 లక్షలతో ఈ భవనం నిర్మాణం చేపట్టారు. బుధవారం అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ విచ్చేసి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, జనసేన పార్టీ



మండల అధ్యక్షులు చోడగం విమల్ కృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షులు బండి నాగార్జున, టీడీపీ నాయకులు బర్రా అగ్గిరాముడు, మాజీ ఎంపీపీ తిరుమలశెట్టి రామారావు, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలశెట్టి బాల నాగేశ్వరరావు, కళ్లేపల్లి లక్ష్మణ, తమ్ము మనోజ్, పంచాయతీ కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, పల్లెపాలెం పెద్దలు, పాల్గొన్నారు.

# ఆవేశంతో అనర్థాలు... నిగ్రహం అవసరం...

మార్కాపురం : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 25: మార్కాపురం సబ్ జైలును జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ షేక్ ఇబ్రహీం షరీఫ్ బుధవారం తనిఖీ చేశారు .ఈ సందర్భంగా విచారణ ఖైదీలను, వివిధ కేసులలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలను, వారి కేసుల వివరములను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. తరువాత జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడుతూ మానవ జన్మ ను మంచిని, చెడును గ్రహించే విచక్షణ జ్ఞానం మనుషులు కలిగి ఉండాలన్నారు. కుటుంబ సభ్యుల మధ్య సత్సంబంధాలు ఉండాలని, అవి కొరవడిన నాడు మానవ సంబంధాలు, కుటుంబ సంబంధాలు విచ్ఛిన్నమైనప్పుడు సమాజంలో శాంతి ఉండదన్నారు . మనుషులు ఆవేశంతో విచక్షణ జ్ఞానాన్ని కోల్పోయి, నిగ్రహం నశించి నేరాలకు పాల్పడుతున్నారని, తద్వారా కుటుంబ సభ్యులను




కోల్పోతున్నారని, ప్రతి ఒక్కరు చట్టాలను అతిక్రమించకూడదన్నారు. మత్తు పదార్థాలను వాడిన యువత ఆరోగ్యాన్ని నిర్వీర్యం చేసుకోవడమే కాక కుటుంబ సభ్యులకు దూరమవుతున్నారని, నిగ్రహం లేక నేరాలకు పాల్పడుతున్నారన్నారని, చేసిన తప్పులకు పశ్చాతాపం చెంది చెడు అలవాట్లను వీడి పటిష్టమైన కుటుంబ వ్యవస్థను ఏర్పరచుకోవాలన్నారు. బెయిలు ,అరెస్టు ఉచిత న్యాయ సహాయం గురించి అవగాహన కల్పించారు. విచారణ ఖైదీలకు అందుతున్న సదుపాయాలను,వారికి అందుతున్న ఆహారము పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం నందు ప్యానల్ లాయర్లు షేక్ జహీర్ సలాం, సబ్ జైల్ సూపరెండేంట్ ఎం.విజయ్ కుమార్, పియల్వి షేక్ బాషా, కోర్ట్ సిబ్బంది ,జైలు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల మరో రణభేరి

ప్రత్తిపాడు, సత్తెనపల్లి : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 25: నూతన పిఆర్‌సిని వెంటనే నియమించాలని, 29 శాతం ఐఆర్‌ను తక్షణమే ప్రకటించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయులు దీక్షలు చేశారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి 3.0లో భాగంగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని నియోజకవర్గ కేంద్రాల్లో ఒక్కరోజు దీక్షలు చేసి అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. దీక్షలకు పలు సంఘాలు మద్దతు తెలపగా సాయంత్రం దీక్షలను విరమించారు. ఇందులో భాగంగా గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో తహశీల్ధార్ కార్యాలయం వద్ద దీక్షను యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్, పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని తాలూకా సెంటర్‌లో దీక్షను జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లవుతున్నా ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని అన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరల దృష్ట్యా ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎలను విడుదల చేయాలని, 29 శాతం మధ్యంతర భృతిని సత్వరం ప్రకటించాలని, 2022లో నిలిపివేసిన ఇఎల్ సొమ్మును వెంటనే విడుదల చేయాలని కోరారు. యుటిఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి చిన్న శ్రీనివాసరావు, ఆడిట్ కమిటీ సభ్యులు కిషోర్‌కుమార్, సత్తెనపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రమేష్ బాబు, నంబుల విష్ణు, ఉద్యోగుల జెఎసి సత్తెనపల్లి తాలూకా యూనిట్ అధ్యక్షులు మణిరావు మాట్లాడుతూ ఇహెచ్ఎస్, మెడికల్ బిల్లుల సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకుంటే భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. అనంతరం సత్తెనపల్లి శిబిరంలో ఉపాధ్యాయులకు ఎపి ఎన్‌జిఒ యూనిట్ ప్రధాన కార్యదర్శి అంబేద్కర్ నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. తాలూకా సెంటర్ నుండి తహశీల్ధార్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి తహశీల్ధార్ చక్రవర్తికి వినతి పత్రం అందజేశారు. ప్రత్తిపాడు దీక్షలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా



సహాధ్యక్షులు ఎమ్‌డి.షకీలా బేగం, జి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు ఎం.కోటిరెడ్డి, కె.ప్రసాద్, జిల్లా ఆడిట్ సభ్యులు కె.ప్రేమ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.చంద్రశేఖర్‌రెడ్డి, పెదనందిపాడు మండల అధ్యక్షులు ఎ.రత్నాకుమార్, ప్రధాన కార్యదర్శి పాణిరెడ్డి, గుంటూరు రూరల్ మండల ప్రధాన కార్యదర్శి షేక్ బాజీబాబు, శ్రీదేవి, ప్రత్తిపాడు మండల ప్రధాన కార్యదర్శి ఎ.యోగానందరావు పాల్గొన్నారు. సత్తెనపల్లి దీక్షలో ముప్పాళ్ల, బెల్లంకొండ, రాజుపాలెం మండలాల యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేష్, నాగేశ్వరరావు, తాజుద్దీన్, విజరుకుమార్, బి.ఫణి, సిహెచ్.విజయరాజు, రాష్ట్ర కౌన్సిలర్ టి.శేషగిరిరావు, జిల్లా మహిళా ఉపాధ్యక్షులు ఎ.భాగేశ్వరీదేవి, జిల్లా కార్యదర్శి విజయకమల, సత్తెనపల్లి బాధ్యులు కె.ఆనందరావు, కె.శివలక్ష్మి, కె.రాంబాబు, బివి శేషిరెడ్డి, వై.శ్రీనివాసరావు, నీలి, పద్మావతి, సీనియర్ నాయకులు బి.వెంకటరావు, ఎ.ఠాగూర్, జె.బైరాగి, ఎన్.విజయభాస్కర శాస్త్రి, పెద్దఎత్తున ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన రద్దు : జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

బాపట్ల : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 25: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం చీరాల మండలం పర్యటన రద్దు అయిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాపట్ల జిల్లా, చీరాల మండలంలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొనవలసియున్నది. అమరావతిలో మార్చి 28 న ఎపి ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఉండటంతో చీరాల పర్యటన రద్దు అయిందని జిల్లా కలెక్టర్



ఆ ప్రకటనలో తెలిపారు.

# బాల్య వివాహాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీ పోక్సో చట్టాలపై అవగాహన

ఎన్టీఆర్ జిల్లా, పెన్ పవర్ ప్రతినిధి మార్చి 25: జగ్గయ్యపేట పట్టణం లో ఉక్కు కళావేదిక నందు జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ వారు పురోహితులు, మైనారిటీ ఖాజీలు, పాస్టర్లు మహిళ సంరక్షణ కార్యదర్శులకు బాల్య వివాహాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీ .పోక్సో చట్లలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. చిల్లకల్లు శిశు అభివృద్ధి ప్రాజెక్ట్ అధికారిని. సత్యవతి మాట్లాడుతూ బాల వివాహ్ ముక్త్ భారత్ 100 రోజుల కార్యక్రమం లో భాగంగా ఈరోజు ఇక్కడ బాల్య వివాహలు. పోక్సో చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నాము. నవంబర్ 26 నుండి మార్చి 8 వరకు అన్ని పాఠశాలు, కాలేజీలు, చర్చిలు, మసీదులు, దేవాలయాలు. వివిధ శాఖల అధికారులకు బాల్య వివాహాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీ. పోక్సో చట్టాలు గురించి అవగాహన సదస్సులు నిర్వహించ డం జరుగుతుంది అని పేర్కొన్నారు. ఏసీడీపీఓ సరళ మాట్లాడుతు టీనేజ్ ప్రెగ్నెన్సీ ద్వారా పుట్టబోయే పిల్లలు తక్కువ బరువు అనారోగ్య సమస్యల తో మాత శిశు మరణాలకు దారితిస్తాయని పేర్కొన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి యమ్ .రాజేశ్వరరావు మాట్లాడుతు జిల్లాలో మిషన్ వాత్సల్య స్కీం నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు..కర్లపాటి శ్రీనివాస రావు బాల్య వివాహాలను నివారణ చేయుటకు గ్రామ వార్డు స్థాయి లో బాల్య వివాహ పరివేక్షణ కమిటీలు ఏర్పాటు చెయ్యటం జరిగింది. బాల్య వివాహలు జరగకుండా కమిటీ వాళ్ళకు మతపెద్దలు ప్రజలు సాకరించాలి పేర్కొన్నారు. వై.జాన్సన్ బాల్య వివాహం చట్టం గురించి వివరించారు.




కె కిరణ్ కుమార్ పోక్సో చట్టం గురించి వివరించారు .ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ శంకర్, దేవదాయ శాఖ ఈఓ. జయ ప్రకాష్, మైనారిటీ ఖాజీ అబ్దుల్ ఆజమ్, జాకోబ్, ప్రసాద్, స్వప్న, రాణి, సూపెర్వైసోర్లు సువర్ణ, భాగ్యలక్ష్మి, రజని జ్వాలా, బిబి జాన్, వెంకట కుమారి ఖాజీలు పాస్టర్లు పుతోహితులు, మహిళ సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

# జగ్గయ్యపేట మున్సిపాలిటీలో ఎగ్ కార్ట్ యూనిట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పెన్ పవర్ ప్రతినిధి మార్చి 25: జగ్గయ్యపేట మున్సిపాలిటీ పరిధిలో గోనెలా పద్మ, వై రోజా, ఎం.రేఖా అనే ముగ్గురు లబ్ధిదారులకు నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (యన్ ఈ సి సి) ఆధ్వర్యంలో మంజూరైన ఎగ్ కార్ట్ దుకాణాలను గౌరవ శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి లబ్ధిదారునికి రూ.35,000 విలువైన బండి మరియు రూ.15,000 విలువైన సామగ్రిని అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ

పేదలకు ఉపాధి కల్పించి ఆర్థికంగా నిలబెట్టాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఈ యూనిట్లను ప్రారంభించిందని తెలిపారు. స్వయం ఉపాధి పొందాలని ఆశించే వారికి ఈ అవకాశం ఎంతో ఉపయోగకరమని ఆయన పేర్కొన్నారు అలాగే మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలనుకునే నిరుద్యోగ యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రుణ సదుపాయాలు అందిస్తున్నాయని, అందరూ ఈ అవకాశాలను



సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర , కన్నెబోయిన రామలక్ష్మి, కాకులపాటి కృష్ణమోహన్, కర్ల జోజి, గింజుపల్లి కృష్ణ, తాటి రామారావు, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ పి. మురళీ కృష్ణ ప్రసాద్ గారు, టిఎల్యఫ్ ప్రెసిడెంట్ నజీమూన్ గారు, మెప్మా అధికారులు సుధారాణి , టి ఈ ఐ బీ సుగుణ , రాధ, కౌన్సిలర్లు, మెప్మా సి ఓ లు వెంకట్, ప్రసాద్, ఆర్ పి లు, ఓ బీ లు మరియు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# కోకాకోలా కంపెనీ సేవలు అభినందనీయం.







మంగళగిరి, పెన్ పవర్ ప్రతినిధి మార్చి 25:పెదవడ్లపూడిలో కోకాకోలా కంపెనీ ఆధ్వర్యంలో అభివృద్ధి పరిచిన పాతూరి నాగభూషణం కాలనీలోని అంగన్వాడి కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ హాజరై అభివృద్ధి పరిచిన అంగన్వాడి కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో కిరణ్ చంద్ మాట్లాడారు. రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ సౌజన్యంతో కోకాకోలా సహకారంతో అంగన్వాడీ కేంద్రంను అభివృద్ధి పరిచారన్నారు. మంత్రి నారా లోకేష్ పలు కంపెనీలతో మాట్లాడి సీఎస్ఆర్ ఫండ్స్ నియోజకవర్గంలో పెట్టాలని కోరడంతో అనేక కంపెనీలు ముందుకు వచ్చి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. కోకాకోలా కంపెనీ తమ వ్యాపారంతో పాటు సమాజంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. పెదవడ్లపూడి, ఆత్మకూరు ప్రాంతాలలో కంపెనీ సుమారు కోటి రూపాయలు వ్యయంతో పాఠశాలలు, పీహెచ్సీలు, అంగన్వాడీ కేంద్రాలను అభివృద్ధికి సహకరించడం పట్ల కంపెనీ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఫ్యాక్టరీ మేనేజర్ మనీష్, పబ్లిక్ రిలేషన్ మేనేజర్ రాము, హెచ్ఆర్ మేనేజర్ క్రాంతి, టీడీపీ సీనియర్ నాయకులు మాదల రమేష్, మల్లవరపు వెంకట్, సీడీపీఓ సరిత, సూపర్వైజర్ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు పుస్తకం, స్టేషనరీని చైర్మన్ కిరణ్ చంద్ చేతుల మీదగా పంపిణీ చేశారు.

# పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు వాహనదారులకి తప్పని తిప్పలు





బెల్లంకొండ పెన్ పవర్ ప్రతినిధి మార్చి 25: మండలంలో పెట్రోల్ కొరత ఏర్పడడంతో కొన్ని బంకుల్లో నో స్టాక్ బోర్డులు పెడుతున్నారు "నో స్టాక్" బోర్డులు దర్శనమిస్తుండటంతో వాహనదారులు ఆటో టాక్సీ టూవీలర్ వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ఇంధనం దొరకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది పెట్రోల్ బంక్ డీలర్లు స్టాక్ అందుబాటులోకి వస్తుందని భరోసా ఇచ్చేంతవరకు ఇక్కట్లు తప్పవని అమెరికా - ఇరాన్ యుద్ధం జరుగుతుండటంతో ఇంధన దిగుమతి అయ్యేవరకు ఈ పరిస్థితి ఇలాగే కొనసాగే అవకాశం ఉంటుందనుకుంటున్నారు

# మంగళగిరిలో గ్యాస్ ఏజెన్సీల అక్రమాలు - యధేశ్చగా హోటళ్లకు డొమెస్టిక్ సిలిండర్లు సరఫరా.



మంగళగిరి, పెన్ పవర్ ప్రతినిధి మార్చి 25: మంగళగిరి నియోజకవర్గంలో గ్యాస్ ఏజెన్సీల అక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. నివాస గృహాల్లో వాడుకునేందుకు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయలేని ఏజెన్సీలు హోటళ్లు, రెస్టారెంట్లకు మాత్రం నిరంతరాయంగా డొమెస్టిక్ సిలిండర్లు సరఫరా చేస్తున్నారు. వీధుల వెంబడి చిన్నపాటి టిఫిన్ సెంటర్లలో సైతం డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ లను వినియోగిస్తున్నారు. వాస్తవానికి డొమెస్టిక్ సిలిండర్ ను కమర్షియల్ గా వినియోగించడం చట్టరీత్యా నేరం. ప్రభుత్వం నిర్దేశించిన ఎల్పిజి సప్లై నియంత్రణ, పంపిణీ ఆర్డర్ 2000 ప్రకారం ఇళ్ల కోసం సబ్సిడీతో వచ్చే గ్యాస్ సిలిండర్ లను వ్యాపారాలకు మళ్లించడం పూర్తిగా చట్ట విరుద్ధం. ఇటీవల కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన తాజా ఆదేశాల ప్రకారం నిత్యవసర వస్తువుల చట్టం 1955 ద్వారా ఎల్పిజి రూల్స్ మరింత కఠినతరం చేశారు. దేశంలో గ్యాస్ కొరత రాకుండా సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూసేందుకే ఈ చట్టం ద్వారా కఠిన చర్యలు తీసుకుంటారు. వాస్తవానికి వంట గ్యాస్ సిలిండర్ ని అక్రమంగా ఉపయోగించడం అనేది నిబంధన ఉల్లంఘన మాత్రమే కాదు, బ్లాక్ మార్కెటింగ్ గా పరిగణించవచ్చు. గ్యాస్ సిలిండర్ బ్లాక్ మార్కెట్ కు సంబంధించి శిక్షలు తీవ్రంగా ఉన్నాయి. నేరం రుజువైతే కనీసం మూడు నెలల నుండి ఏడు సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం లేకపోలేదు. అలాగే భారీ స్థాయిలో జరిమానా కూడా విధిస్తారు. దీంతోపాటు వినియోగదారుని పేరు మీద ఉన్న డొమెస్టిక్ గ్యాస్ కనెక్షన్ ను శాశ్వతంగా రద్దు చేయొచ్చు. డొమెస్టిక్ సిలిండర్ లను నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తే సంబంధిత గ్యాస్ ఏజెన్సీలపై కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంది. తప్పు రుజువైతే సంబంధిత శాఖల అధికారులు ఏజెన్సీల లైసెన్స్ రద్దు చేసే అధికారం కూడా కలిగి ఉన్నారు. హోటళ్లు ,రెస్టారెంట్ల నిర్వాహకులు డొమెస్టిక్ సిలిండర్లను బహిరంగంగానే వినియోగిస్తున్న సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడం కొసమెరుపు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రహదారి సౌకర్యం కల్పించాలంటూ గేట్ గ్రామస్తుల నిరశన...



రెంటచింతల, పెన్ పవర్ ప్రతినిధి మార్చి 25: (మార్చి 25 ) : తమ గ్రామంలో ఆర్వోబీ( రైల్వే ఓవర్ బ్రిడ్జి) నిర్మించడం వల్ల రహదారి సౌకర్యం లేకుండా పోయిందని దీనిపై అధికారులు తక్షణే స్పందించాలని కోరుతూ పాలువాయిగేట్ గ్రామస్తులు బుధ వారం గేట్ సమీపంలో నిరశన చేపట్టారు. ఈ సందర్భంగా సీనియర్ టీడీపీ నేత వెల్నాటి అర్జున్ మాట్లాడుతూ తమ గ్రామస్తులు బస్సులు ఎక్కాలంటే 35 అడుగుల ఎత్తులో ఉండే ఆర్వోబీపైకి ఎక్కాల్సి ఉందన్నారు. గడ్డిమోపులతో మహిళలు అసలు ఎక్కలేకపోతున్నారన్నారు. ఆర్వోబి మంచికల్లు అడ్డ రోడ్డు నుంచి తమ గ్రామం చివరి వరకు 1.2 కి.మీ. దూరం వుందన్నారు.

# నేటి నుంచి శ్రీ సీతారాములవారి దేవాలయం శతాబ్ది మహోత్సవాలు...!

## దేవాలయంలో పూజలందుకుంటున్న శ్రీ సీతారామ లక్ష్మణ భరత, శతృఘ్న, హనుమత్ పరివారం(మూలవిరాట్లు)....



రెంటచింతల పెన్ పవర్ ప్రతినిధి మార్చి 25: రెంటచింతల (మార్చి 25) ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న మండల కేంద్రమైన రెంటచింతలలో గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజుల పాటు అతి పురాతనమైన శ్రీ సీతారామ లక్ష్మణ భరత, శతృఘ్న, హనుమత్ పరివార సమేత దేవాలయం శతాబ్ది మహోత్సవాలకు సిద్ధమైంది. దేవాలయం 100 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా దేవాలయ వంశీకులు పెరుమాళ్ల వారి ఆధ్వర్యంలో ఈ శతాబ్ది మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవాలయ ప్రధాన అర్చకులు శ్రేష్టి సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో పిన్నెల్లి సుబ్రమణ్య శర్మ హోమములు, విశేష పూజలు నిర్వహించనున్నారు. గురువారం ఉదయం 9 గం. మేళతాళములతో ఊరేగింపు, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనము, అఖండ ప్రతిష్టాపన రక్షాబంధనము, పంచగవ్య ప్రాశనము, దీక్షా చారణము, అగ్ని ప్రతిష్టాపనము, ప్రాతరోపాసన నిర్వహించి భక్తులకు తీర్థప్రసాద పంపిణీ చేయనున్నారు. సాయంత్రం 5 గం. ధ్వజారోహనము, అంకురార్పణము. సుదర్శన హోమము, అనుష్ఠానములు, అష్టోత్తర శీతకలక ఆవాహనము, మండపారాధనలు వైభవంగా నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 9 గం. మూల విరాట్లకు, ఉత్సవ విగ్రహములకు పంచామృత సహిత దశవిధస్నానములు, స్వామివారిని, అమ్మవారిని పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెగా అలంకరించి మధ్యాహ్నం 12 గం. అభిజిత్ ముహూర్తమందు సీతారామ కళ్యాలు మహోత్సవ వేడుకలు కనులపండువగా వేదమంత్రాల మధ్య జరుగుతుందన్నారు. సాయంత్రం 5 గం. సాయమౌ పోసన, సుదర్శన సహిత లక్ష్మి హోమము, శ్రీ సూక్త పురుష సూక్త హవనములు అనంతరం ఉత్సవమూర్తులతో మేళతాళాలతో గ్రామోత్సవం ఉంటుందన్నారు. శనివారం ఉదయం 9 గం.నిత్య హోమము, సుదర్శన హోమము, లక్ష్మి హోమము, పూర్ణాహుతి, మూలవారాట్లకు మహా కుంభాభిషేకము అనంతరం భక్తులకు తీర్థప్రసాద పంపిణీ, మధ్యాహ్నం 12 గం. నుంచి ఈ శతాబ్ది మహోత్సములలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. సాయంత్రం 5 గం. స్వామివార్ల ఊరేగింపు గ్రామోత్సవము, పవళింపు సేవ, తీర్థప్రసాద వినియోగం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

# ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన అభినందనీయం - ఎమ్మెల్యే ఆనంద బాబు.



వేమూరు(భట్టిప్రోలు)పెన్ పవర్ ప్రతినిధి మార్చి 25: వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు,పెట్టుబడుల ఆకర్షణకు తీసుకుంటున్న చర్యలు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కొత్త దిశను నిర్దేశిస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా భారీ పారిశ్రామిక ప్రాజెక్టులు రాష్ట్రంలో స్థాపన కావడం గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో స్థాపించబడుతున్న పెద్ద పరిశ్రమలు కేవలం ఉత్పత్తి కేంద్రాలుగానే కాకుండా,లక్షలాది యువతకు ఉపాధి అవకాశాలను కల్పించే శక్తివంతమైన వేదికలుగా మారుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా ఉక్కు పరిశ్రమల వంటి భారీ ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు.ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా వేలాది ఉద్యోగ అవకాశాలు సృష్టించబడుతున్నాయని,స్థానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన అన్నారు. అలాగే అనుబంధ పరిశ్రమలు,ఎం ఎస్ ఎం ఈ ఎస్ కూడా అభివృద్ధి చెందుతాయని,దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక చైతన్యం పెరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పారదర్శక పాలన, వేగవంతమైన అనుమతుల ప్రక్రియ, పెట్టుబడిదారులకు అనుకూల విధానాలు అమలు చేయడం వలన ప్రపంచ స్థాయి కంపెనీలు ఆంధ్రప్రదేశ్ వైపు ఆకర్షితులవుతున్నాయని ఆయన తెలిపారు."ఉద్యోగ అవకాశాలు ప్రధమం" విధానంతో యువతకు ఉద్యోగాల కల్పన ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు.మౌలిక వసతుల అభివృద్ధి కూడా వేగంగా జరుగుతోందని, రహదారులు, రైల్వేలు,పోర్టులు మరియు ఇతర సదుపాయాలు అభివృద్ధి చెందడం ద్వారా పరిశ్రమల పెరుగుదలకు అనుకూల వాతావరణం ఏర్పడుతోందని చెప్పారు.దీని ఫలితంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెరిగి, జిడిపి వృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. వేమూరు నియోజకవర్గంలో కూడా అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం,ఉపాధి అవకాశాలను పెంపొందించడం, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతోందని తెలిపారు. ప్రజల సహకారం,ప్రభుత్వ దృఢ సంకల్పం కలిసివస్తే వేమూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని, ప్రతి కుటుంబానికి అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేస్తామని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు విశ్వాసం వ్యక్తం చేశారు.

# చేబ్రోలులో నీటి భద్రత పై అవగాహన కార్యక్రమం




చేబ్రోలు: పెన్ పవర్ ప్రతినిధి మార్చి 25:చేబ్రోలు మండల ప్రజా పరిషత్ బుధవారం గ్రామీణ నీటి భద్రత మరియు సామాజిక భాగస్వామ్యం అనే అంశము పై గ్రామస్థాయిలో నిర్వహణ కోసం ఎంపీటీసీ , సర్పంచ్ మరియు వార్డు మెంబరులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామస్థాయిలో నీటి సంరక్షణలో గ్రామ ప్రజల భాగస్వామ్యంతో కూడిన గ్రామ స్వరాజ్యం అని ఎంపీడీవో టి. ఊహారాణి అన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో ప్రతి ఇంటికి ప్రతి వ్యక్తికి రోజుకి 55 లీటర్ల సురక్షిత నీరు అందించడము జరుగుతుంది అన్నారు.ఈ నీటి సంరక్షణకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ వార్షిక యాక్షన్ ప్రణాళిక 2025 - 26 సంబంధిత విషయాలపై స్థానిక ప్రజాప్రతినిధులకు ఒక్కరోజు మండల స్థాయి శిక్షణలో అవగాహన కల్పించటం జరిగిందన్నారు.గ్రామ అభివృద్ధి , నిర్ణయాధికారం మరియు సేవలు అమలులో స్థానిక ప్రజలను ( గ్రామస్తులను ) భాగస్వామ్యం చేసి , గ్రామ సభలలో పాల్గొని , నిరంతర పర్యవేక్షణ ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం అని వివరించారు . గ్రామ స్థాయిలోనే నీరు వనరుల లభ్యత , సంరక్షణ , వినియోగం , నీటి పథకాల నిర్వహణ మరమ్మత్తులు వంటి సమస్యలను గుర్తించి పరిష్కరించుకోవడం లాంటి అంశాలలో స్థానిక ప్రజలను స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వాములు చేయుటవే జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎం రవిశంకర్ , పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ గ్రేడ్ 5 పుండరీనాథ్ , స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు .

# కారు ఆటో ఢీ.. ఇద్దరికి గాయాలు

రెంటచింతల, పెన్ పవర్ ప్రతినిధి మార్చి 25:( మార్చి 25 ) : మండల కేంద్రమైన రెంటచింతలలోని 167 జాతీయ రహదారి వద్ద ఓ ప్రార్థ నా మందిరం సమీపంలో బుధవారం ఎదురెదురుగా వస్తున్న కారు ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో వున్న మణికంఠారెడ్డితో పాటు మరో వ్యక్తి గాయపడ్డారు. క్షతగాత్రుల్ని గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# టెన్త్ పరీక్షలకు 8 మంది గైర్హాజరు..

రెంటచింతల, పెన్ పవర్ ప్రతినిధి మార్చి 25:(మార్చి 25 ) : మండల కేంద్రమైన రెంటచింతలలోని వివిధ సెంటర్లలో నిర్వహిస్తున్న టెన్త్ పబ్లిక్ ఎగ్జామ్స్ కు సంబంధించి బుధవారం నిర్వహించిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు రూట్ ఆఫీసర్ ఎంఈవో 2 శివ నాగేశ్వరరావు చెప్పారు. వైఆర్ఎస్ హైస్కూల్లో 05, ఫాతిమా విద్యానికేతన్ 02, సెయింటాన్స్ లో 01 మంది రాలేదన్నారు.

# ఏపీలో మహిళా నియోజవర్గాలు..ఇవే

**తిరుపతి,మార్చి 25, పెన్ పవర్:** దేశవ్యాప్తంగా నియోజకవర్గాలు పెరగనున్నాయి. నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్డీఏ సమావేశంలో స్పష్టమైన సంకేతాలు అందాయి దీనిపై. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే పునర్విభజన బిల్లు పార్లమెంట్లో ఆమోదించనున్నారు. అదే జరిగితే దేశవ్యాప్తంగా పార్లమెంట్ సీట్లతో పాటు అన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల సంఖ్య గణనీయంగా పెరగనుంది. అయితే ఇప్పటికే మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తూ 2023లో పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందింది. అయితే ఇప్పుడు పునర్విభజన బిల్లుతో పాటు మహిళా బిల్లును కూడా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం సంచలనంగా మారింది. పునర్ విభజనకు సంబంధించి ఏపీలో 50% చొప్పున అసెంబ్లీ, లోక్సభ సీట్లు పెరగనున్నాయి.ప్రస్తుతం ఏపీలో 175 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంటు సీట్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ తాజా ప్రతిపాదనతో అసెంబ్లీ స్థానాలు 263, లోక్సభ సీట్లు 38 కి చేరుకుంటాయి. మహిళా ప్రాతినిధ్యం కూడా పెరగనుంది. వారికి 87 అసెంబ్లీ, 13 పార్లమెంట్ సీట్లు దక్కనున్నాయి. అయితే ఫలానా నియోజకవర్గం మహిళలకు రిజర్వ్ చేస్తారని చెప్పడం కష్టం కానీ.. మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండే నియోజకవర్గాలను మాత్రం మహిళలకు రిజర్వ్ చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో 58 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికం. వాటిని మహిళలకు రిజర్వ్ చేసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.రాష్ట్రంలో ప్రధానంగా భీమిలి నియోజకవర్గం లో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. అక్కడ ఏకంగా 1,65,570 మంది మహిళలు ఉండడం విశేషం. పాణ్యం, గాజువాక, చంద్రగిరి, తిరుపతి, మంగళగిరి, పెనమలూరు, రంపచోడవరం, పెందుర్తి, గురజాల, విశాఖపట్నం నార్త్,కోవూరు, కర్నూలు, విజయవాడ ఈస్ట్,విజయవాడ సెంట్రల్, గుంటూరు వెస్ట్,గన్నవరం, మైలవరం, నెల్లూరు రూరల్, తెనాలి, నంద్యాల, అనంతపురం అర్బన్, ఇచ్ఛాపురం, కడప, శ్రీకాకుళం, చింతలపూడి, రాజమహేంద్రవరం సిటీ,ప్రత్తిపాడు, రాజమహేంద్రవరం రూరల్, గుంతకల్లు, కాకినాడ సిటీ, పలమనేరు, విశాఖపట్నం ఈస్ట్, మాచర్ల,వినుకొండ, కాకినాడ రూరల్, భీమవరం, రాయదుర్గం, మదనపల్లి,పోలవరం, కావలి,జమ్మలమడుగు,కొత్తపేట, పాయకరావుపేట, శ్రీకాళహస్తి, ప్రొద్దుటూరు,ఆదోని, విజయనగరం, రాయచోటి, కదిరి, రాప్తాడు,ఆలూరు, గుంటూరు ఈస్ట్, విజయవాడ వెస్ట్, గూడూరు, ఒంగోలు, బనగానపల్లె,తాడిపత్రి నియోజకవర్గాల్లో మహిళలు అధికం.పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి విశాఖపట్నంలో అత్యధికంగా 9,20,376 మంది మహిళలు ఉన్నారు. ఆ తరువాత స్థానాల్లో గుంటూరు, నరసరావుపేట, నెల్లూరు, తిరుపతి, అనంతపురం, నంద్యాల,విజయవాడ, కర్నూలు,కాకినాడ, ఏలూరు, కడప, చిత్తూరు, రాజంపేట, శ్రీకాకుళం, అనకాపల్లి, హిందూపురం, రాజమండ్రి,ఒంగోలు, అరకు, విజయనగరం, మచిలీపట్నం, బాపట్ల, అమలాపురం, నరసాపురం పార్లమెంట్ స్థానాల్లో మహిళలు ఎక్కువ. మరి ఈ నియోజకవర్గాల్లో మహిళలకు ఛాన్స్ దక్కుతుందా? లేదా? అన్నది చూడాలి.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
పొ. 12 సెం.మీ. వె. 8 సెం.మీ
మరిన్ని వివరాలకు సంప్రదించండి
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఢిల్లీలోనూ నెంబర్ 11 తంటా

**విజయవాడ, మార్చి 25, పెన్ పవర్:** ఢిల్లీలోని నూతన పార్లమెంటు భవనంలో గదుల కేటాయింపు విషయం.. ఏపీలో ఇప్పుడు ఆసక్తికర చర్చకు కారణమైంది. గదుల కేటాయింపు ప్రక్రియలో భాగంగా స్పీకర్ కార్యాలయం.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 11వ నంబర్ గది కేటాయించింది. పార్టీల బలాబలాల ఆధారంగా స్పీకర్ కార్యాలయం గదులను కేటాయిస్తోంది. ఈ క్రమంలోనే వైసీపీ ఎంపీల కోసం నూతన పార్లమెంట్ భవనం ఫస్ట్ ఫ్లోర్‌లోని 11వ నంబర్ గదిని కేటాయించారు. అయితే వైసీపీ ఎంపీలు.. తమ గదిని మార్చాలని స్పీకర్‌ను కోరినట్లు తెలిసింది. స్పీకర్ ఓంబిర్లాతో భేటీ అయిన వైసీపీ ఎంపీలు.. తమకు 11వ నెంబర్ గద వద్దని కోరినట్లు తెలిసింది. అందుకు బదులుగా మరో గదిని కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. దీంతో వైసీపీ ఎంపీల విజ్ఞప్తిని సానుకూలంగా తీసుకున్న స్పీకర్.. వైసీపీ ఎంపీల కోసం 12వ నంబర్ రూమ్ కేటాయిస్తూ మార్పులు చేశారు.మరోవైపు నూతన పార్లమెంట్ భవనంలో టీడీపీకి 9వ నంబర్ గది కేటాయించారు. మొదటి అంతస్తులోని 9వ నంబర్ గదిని టీడీపీ ఎంపీల కోసం కేటాయించారు. కొత్త పార్లమెంట్ భవనం అందుబాటులోకి రావటంతో.. పాత పార్లమెంట్ భవనంలో ఉన్న పార్టీ ఆఫీసులనుఖాళీ చేయిస్తున్నారు. నూతన పార్లమెంట్ భవనంలో పార్టీలకు గదులు కేటాయిస్తున్నారు. ఈ క్రమంలోనే వైసీపీకి 12, టీడీపీకి 9వ నంబర్ గదులు కేటాయించామరోవైపు 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం 11 సీట్లకు పరిమితమైంది. 2019 ఎన్నికల్లో 151 సీట్లలో విజయం సాధించిన వైసీపీ.. 2024లో మాత్రం ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. వైఎస్ జగన్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మినహా మంత్రివర్గంలోని నేతలందరూ ఓటమి పాలయ్యారు. అసెంబ్లీ సామర్థ్యంలో పది శాతం సీట్లు సాధించకపోవటంతో వైఎస్సాఆర్ కాంగ్రెస్ పార్టీకి ఏపీ ప్రభుత్వం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు.ఇదే సమయంలో వైసీపీ 11 సీట్లను పరోక్షంగా ఉద్దేశిస్తూ కూటమి పార్టీల కార్యకర్తలు సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తుంటారు. ఈ క్రమంలోనే నూతన పార్లమెంట్ భవనంలో వైసీపీకి 11 నంబర్ గది కేటాయించడం.. ఆ తర్వాత వైసీపీ ఎంపీల అభ్యర్థనతో దానిని 12వ నంబర్ గదికి మార్చటం చర్చనీయాంశమవుతోంది.

## బెజవాడలో ఏం జరుగుతోంది....

**విజయవాడ, మార్చి 25, పెన్ పవర్:** ఉగ్రవాదులతో సంబంధం ఉందని అనుమానిస్తున్న ముగ్గురు యువకులకు విజయవాడ సీసీఎం కోర్టు రిమాండ్ విధించింది. ఏప్రిల్ 6వ తేదీ వరకూ రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు పాకిస్థాన్ హ్యాండ్లర్లతో సంబంధాలు ఉన్నాయంటూ ముగ్గురు యువకులను విజయవాడ టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఆల్ మాలిక్ ఇస్లామిక్ యూత్ పేరుతో ప్రత్యేక గ్రూప్ ఏర్పాటు చేసి ఉగ్రవాద భావజాలాన్ని యువతలో ప్రోత్సహించేందుకు వీరు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు. విజయవాడలో ఉగ్రవాద సానుభూతిపరుల కదలికల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. పాకిస్థాన్ హ్యాండ్లర్లతో సంబంధాలు ఏర్పరచుకొని.. సోషల్ మీడియా ద్వారా ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను విజయవాడ టూటౌన్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. మహమ్మద్ డానిష్, మీర్జా సొహైల్ మహమ్మద్ రహంతుల్లా షరీఫ్ అనే ముగ్గురు యువకులను అరెస్ట్ చేసిన పోలీసులు.. వీరిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ యువకులు టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా యువతను ఉగ్రవాద భావజాలం వైపు ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరికి పాకిస్థాన్ హ్యాండ్లర్ల నుంచి నిధులు సమకూరుతున్నట్లు నిఘావర్గాలు భావిస్తున్నాయి.మరోవైపు ముగ్గురు నిందితులను విజయవాడ పోలీసులను విజయవాడ సీఎంఎం కోర్టులో హాజరుపరిచారు. వీరికి ఏప్రిల్ ఆరో తేదీ వరకూ కోర్టు రిమాండ్ విధించింది. అనంతరం పోలీసులు వీరిని విజయవాడ సెంట్రల్ జైలుకు తరలించారు. మరోవైపు విచారణ సందర్భంగా లాయర్‌ను నియమించుకున్నారా? అని న్యాయమూర్తి నిందితులను ప్రశ్నించారు. అయితే తాము నియమించుకోలేమని నిందితులు కోర్టుకు తెలిపారు. దీంతో ఈ విషయాన్ని రాతపూర్వకంగా తెలియజేయాలని కోర్టు ఆదేశించింది.మరోవైపు ఈ కేసులో యాంటీ టెర్రరిస్ట్ దళాలు జరిపిన విచారణలో కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ముగ్గురు యువకులు ఆల్ మాలిక్ ఇస్లామిక్ యూత్ పేరుతో గ్రూపును ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. ఏడు రాష్ట్రాలలో 42 మంది సభ్యులతో ఆల్ మాలిక్ ఇస్లామిక్ యూత్ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ గ్రూపు ద్వారా ఉగ్రవాద భావజాలాన్ని ప్రచారం చేస్తున్నట్లు గుర్తించారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటుగా ఢిల్లీ, బిహార్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో కూడా గ్రూపులు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. దీంతో ఆయా ప్రాంతాలకు ప్రత్యేక బృందాలు వెళ్లాయి. ముఖానికి మాస్కులతో ఫోటోలు, సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా పోస్టులు, ఆడియోలు పెడుతున్నట్లు గుర్తించారు. పాకిస్థాన్ , అఫ్గానిస్తాన్‌లో ఉగ్రవాద శిక్షణకు వెళ్లేలా యువతను ప్రోత్సహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు

## అనంతలో ఓపెన్ కూలింగ్ సిస్టమ్

**అనంతపురం, మార్చి 25, పెన్ పవర్:** సవి కాలంలో వాహనదారులకు ఉపశమనం కలిగించేలా అనంతపురంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతపురంలోని సప్తగిరి సర్కిల్ వద్ద ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. సురేష్ నాయక్ అనే ఉపాధ్యాయుడు ఆలోచనతో దీనిని రూపొందించారు. ప్రయోగాత్మకంగా సప్తగిరి సర్కిల్ వద్ద ఏర్పాటు చేశారు. దీని ద్వారా వాహనదారులపై తుంపర్లుగా నీటిని చల్లుతారు. దీంతో ఎండవేడిమి నుంచి వారికి ఉపశమనం కలుగుతుందని అధికారులు చెప్తున్నారు.వేసవి కాలం వచ్చేసింది. ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం పది గంటలకే భానుడు భగభగమండిపోతున్నాడు. మార్చి నెల మధ్యలోనే ఈ పరిస్థితి ఉంటే.. ఏప్రిల్, మే నెలల్లో భానుడి ఉగ్రరూపం మరోస్థాయికి చేరనుంది. ఈ నేపథ్యంలో ప్రజలు భయపడిపోతున్నారు. ఇక ఎండాకాలంలో రోడ్డుపైకి రావాలంటేనే భయపడే పరిస్థితి. ఓ వైపు సుర్రుమనిపించే సూరీడు.. మరోవైపు వేడిగాలులు.. దీంతో ఉక్కబోతను భరించలేక ప్రజల అవస్థలు వర్ణనాతీతం. ఇక వాహనదారుల పరిస్థితి అయితే చెప్పక్కర్లేదు. పైన ఎండ, కింద బండి వేడితో ఇబ్బందుల పడుతుంటారు. ఈ నేపథ్యంలోనే అనంతపురం జిల్లాలో ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు.రాజేంద్రనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న సురేష్ నాయక్ బుర్రలో మెదిలిన ఆలోచన ఇది. వేసవి తాపం నుంచి వాహనదారులకు ఉపశమనం కల్గించేందుకు సురేష్ నాయక్..ఈ ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ ఆలోచన చేశారు. ఇంజనీరింగ్ అధికారుల సహాయంతో అనంతపురంలోని సప్తగిరి సర్కిల్ వద్ద ఈ ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇక్కడ ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నారు. ఎండలకు వాహనదారులు ఇబ్బందులు పడకుండా సప్తగిరి సర్కిల్ వద్ద దీనిని ఏర్పాటు చేశారు.ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ అంటే.. ఒక డ్రమ్ములో నీళ్లను నింపుతారు. ఈ నీటిని మోటార్ల సాయంతో పైపుల ద్వారా తుంపర్లుగా.. రోడ్డుపైనే వెళ్లే వాహనదారులపై వదులుతారు. ట్రాఫిక్ సిగ్నల్ పడిన సమయంలో కూడలి వద్ద ఉన్న వాహనదారులపై తుంపర్లు, తుంపర్లుగా నీరు పడటంతో.. వాతావరణం చల్లబడటంతో పాటుగా.. వారికి కాస్త ఉపశమనంగా ఉంటుందని అధికారులు ఈ ఏర్పాట్లు చేశారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇలాంటి ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టం ఏర్పాటు చేయడం ఇదే తొలిసారని అధికారులు చెప్తున్నారు. మొత్తంగా ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్న ఈ ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ కారణంగా అనంతపురంలోని వాహనదారులు కాస్త రిలీఫ్ పొందుతున్నారు.

# జనసేనలో వారసుల తంటా




**కాకినాడ, మార్చి 25, పెన్ పవర్:** జనసేన పార్టీ ప్రారంభం నుంచే కొన్ని స్పష్టమైన సిద్ధాంతాలతో ముందుకు సాగుతోంది. ముఖ్యంగా వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించకూడదనే ఆలోచన పార్టీకి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చింది. 2019 ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఆ సమయంలో పార్టీకి పెద్దగా ప్రభావం కనిపించలేదు. అయితే 2024 ఎన్నికల నాటికి పరిస్థితి పూర్తిగా మారింది. పార్టీకి ప్రజల్లో డిమాండ్ పెరిగింది, నాయకులు కూడా ఉత్సాహంగా ముందుకు వచ్చారు. ఈ మార్పు వల్లే జనసేన రాజకీయంగా బలపడినట్టు కనిపిస్తోంది.దీంతో జగ్గంపేట వంటి నియోజకవర్గాల్లో టికెట్ల కోసం పోటీ తీవ్రంగా జరిగింది. పార్టీ బలపడటంతో నాయకులు కూడా తమ స్థానం కోసం ప్రయత్నాలు పెంచారు. అయితే ఇప్పుడు మరో ఆసక్తికరమైన పరిణామం కనిపిస్తోంది. కొంతమంది ఎమ్మెల్యేలు తమ కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. బహిరంగంగా పెద్దగా మాట్లాడకపోయినా, నియోజకవర్గ స్థాయిలో తమ వారిని ప్రోత్సహిస్తూ మౌనంగా వ్యూహాలు అమలు చేస్తున్నారు.ప్రస్తుతం ఉన్న 21 మంది ఎమ్మెల్యేలలో కొందరు తమ వారసులను రంగంలోకి దించాలనే ఆలోచనలో ఉన్నారు. మరోవైపు కొంతమంది సీనియర్ నాయకులు కూడా వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తమ కుటుంబ సభ్యులకు అవకాశాలు కల్పించాలని చూస్తున్నారు. అయితే ఈ పరిస్థితి జనసేన పార్టీ అసలు సిద్ధాంతాలకు విరుద్ధంగా ఉందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటివరకు ప్రజల్లో పనిచేసిన నాయకులకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగారు. వారసత్వం కంటే ప్రజాదరణ ఉన్నవారిని ఎంపిక చేయడమే ఆయన విధానంగా కనిపిస్తోంది. గతంలో కూడా ఆయన ఇదే విధంగా టికెట్లు ఇచ్చారు. కాకినాడ రూరల్ నుంచి నానాజీ , రైల్వే కోడూరు నుంచి అరవ శ్రీధర్ వంటి వారికి అవకాశం కల్పించారు. వీరంతా తమ పనితీరు ద్వారా గుర్తింపు పొందిన వారే.ఇప్పుడూ అదే విధానాన్ని కొనసాగించాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇప్పటికే కొంతమంది ఎమ్మెల్యేలు తమ కుటుంబ సభ్యులను ముందుకు తీసుకురావడానికి ప్రయత్నాలు ప్రారంభించడం ఆసక్తికరంగా మారింది. ఈ పరిస్థితిలో పార్టీ తీసుకునే నిర్ణయం కీలకం అవుతుంది. మొత్తంగా చూస్తే, జనసేన పార్టీ సిద్ధాంతాలు ఒకవైపు, నాయకుల వ్యక్తిగత ఆశయాలు మరోవైపు ఉన్న పరిస్థితి ఏర్పడింది. పవన్ కళ్యాణ్ ఈ రెండింటి మధ్య ఎలా సమతుల్యం పాటిస్తారు, వారసత్వ రాజకీయాలపై ఎంతవరకు రాజీ పడతారు అనేది వచ్చే రోజుల్లో స్పష్టత వచ్చే అంశంగా మారింది.

# జగన్ ఇమేజ్ డ్యామేజ్



**విజయవాడ, మార్చి 25, పెన్ పవర్:** వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబంలో చెలరేగిన ఆస్తుల వివాదం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తల్లి విజయమ్మ, చెల్లి షర్మిలతో జగన్ సాగిస్తున్న ఈ న్యాయపోరాటం కేవలం ఒక కుటుంబ సమస్యగా కాకుండా, రాజకీయంగా పెను ప్రభావం చూపే అంశంగా మారింది.వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత ఆస్తుల పంపిణీ విషయంలో జగన్, షర్మిల మధ్య విభేదాలు పొడసూపాయి. గతంలో కుదుర్చుకున్న ఒక అవగాహన ఒప్పందం ప్రకారం కొన్ని ఆస్తులను చెల్లికి బదలాయించాల్సి ఉండగా, జగన్ ఆ ప్రక్రియను నిలిపివేయడం వివాదానికి కేంద్రబిందువు అయింది. ఈ క్రమంలో జగన్ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ను ఆశ్రయించడం, షర్మిలకు ఇచ్చిన షేర్లను తిరిగి తీసుకోవాలని కోరడం సంచలనం సృష్టించింది. దీనికి ప్రతిగా తల్లి విజయమ్మ, షర్మిల తరఫున నిలబడి అఫిడవిట్ దాఖలు చేయడం జగన్‌కు వ్యక్తిగతంగా పెద్ద ఎదురుదెబ్బగా మారింది.జగన్ రాజకీయ జీవితం మొత్తం “మాట తప్పను.. మడమ తిప్పను” అనే నినాదం చుట్టూ తిరుగుతుంది. అయితే, తండ్రి బతికి ఉన్నప్పుడు చెప్పిన అంశాలను, కుటుంబ ఒప్పందాలను ధిక్కరించడం వల్ల ఆయన ‘విశ్వసనీయత’ ప్రశ్నార్థకమైంది. సొంత తల్లిని, చెల్లిని కోర్టుకు లాగడం అనేది తెలుగు సమాజంలో నైతికంగా ఆమోదయోగ్యం కాని విషయం. సామాన్యులెవరూ దీన్ని అంగీకరించరు. చెల్లి విషయంలో అయినా కాస్త ఆలోచిస్తారేమో కానీ, తల్లిని కూడా జగన్ ఇబ్బంది పెడుతున్నారనే అంశమే ప్రజల్లోకి బాగా వెళ్తోంది. ఇది ఆయన వ్యక్తిగత ఇమేజ్‌ను గణనీయంగా దెబ్బతీస్తోంది.ఈ వివాదం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి నష్టం చేకూర్చేలా ఉంది. జగన్ తన పాలనలో ‘అక్కా.. చెల్లెమ్మ’ అంటూ మహిళలకు ప్రాధాన్యతనిచ్చారు. కానీ సొంత చెల్లికి ఆస్తి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారనే ప్రచారం మహిళా ఓటర్లలో ప్రతికూల భావనను కలిగించే అవకాశం ఉంది. టీడీపీ, జనసేన వంటి పార్టీలు ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకుంటున్నాయి. “సొంత తల్లికే న్యాయం చేయలేని వ్యక్తి, రాష్ట్ర ప్రజలకు ఏం న్యాయం చేస్తాడు?” అనే ప్రశ్నను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్నాయి. క్షేత్రస్థాయిలో ఉన్న వైసీపీ కార్యకర్తలు ఈ వివాదంపై ప్రజలకు సమాధానం చెప్పలేక ఇబ్బంది పడుతున్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబం విడిపోవడం వల్ల పార్టీ పట్ల ఉన్న సెంటిమెంట్ పలచబడే ప్రమాదం ఉంది.జగన్ తన ఆస్తులు ఈడీ అటాచ్‌మెంట్‌లో ఉన్నాయని, అందుకే బదలాయింపు సాధ్యం కాదని వాదిస్తున్నారు. కానీ, కుటుంబ సభ్యులు దీనిని కేవలం జగన్ ‘మొండితనం’గా భావిస్తున్నారు. ఆస్తుల విలువ కంటే, తన మాటే చెల్లాలనే ఆయన ‘ఈగో’ వల్లనే ఈ సమస్య ఇంతవరకు వచ్చిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రాజకీయ చాణక్యత ప్రదర్శించాల్సిన చోట, జగన్ తన కుటుంబంపై కఠినంగా వ్యవహరించడం వ్యూహాత్మక తప్పిదమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.జగన్ ఈ సమస్యను త్వరగా పరిష్కరించుకోకపోతే, భవిష్యత్తులో రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఆస్తుల వల్ల ఆర్థిక బలం పెరగవచ్చు కానీ, రాజకీయాల్లో అత్యంత విలువైన ప్రజాభిమానం, విశ్వసనీయతను ఆయన కోల్పోయే ప్రమాదం ఉంది. తల్లి విజయమ్మ ప్రత్యక్షంగా షర్మిల వెనుక నిలబడటం జగన్ రాజకీయ ప్రయాణంలో అతిపెద్ద సవాలుగా మిగిలిపోనుంది.

## వన్డే ప్రపంచకప్ జట్టులో టీ20 వరల్డ్ కప్ హీరోలకి నో ఛాన్స్.. ఏకంగా 8 మంది ఔట్



**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణాఫ్రికా, జింబాబ్వే మరియు నమీబియా సంయుక్త వేదికలలో జరగనున్న 2027 వన్డే ప్రపంచకప్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి ఇప్పుడే ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. 2026 టీ20 వరల్డ్ కప్‌లో న్యూజిలాండ్‌ను ఓడించి ట్రోఫీ గెలిచిన జోరులో ఉన్న టీమిండియా, వన్డే జట్టులో సమూల మార్పులు చేసేందుకు రెడీ అయింది. వన్డే క్రికెట్ లో ఓపికతో పాటు ఇన్నింగ్స్‌ను నిర్మించే వారిపై బీసీసీఐ మొగ్గు చూపుతోంది.

టీ20 ప్రపంచకప్‌లో అద్భుతంగా ఆడిన సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, అభిషేక్ శర్మ, శివమ్ దూబే, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్ లాంటి ప్లేయర్స్ కి 2027 వన్డే జట్టులో చోటు దక్కే అవకాశం కనిపించడం లేదు. వీరందరూ కేవలం టీ20 స్పెషలిస్టులుగానే ముద్రపడటం, వన్డే ఫార్మాట్‌కు అవసరమైన నిలకడ వీరిలో లేకపోవడంతో ఈ 8 మంది ఆటగాళ్ల ఎంపికపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. కానీ, రాబోయే దేశవాళీ, ద్వైపాక్షిక సిరీస్‌లలో వీళ్లందరూ అద్భుతంగా రాణిస్తే తప్ప వన్డే జట్టులోకి పునరాగమనం చేయడం కష్టమే.

భవిష్యత్తు సారథిగా శుభ్‌మన్ గిల్‌ను రెడీ చేయాలని బీసీసీఐ సెలక్టర్లు భావిస్తున్నారు. గిల్ ఇప్పటికే తన బ్యాటింగ్, నాయకత్వ లక్షణాలతో ముందుకు నడుస్తున్నాడు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సిరీస్‌లలో ఆశించిన ఫలితాలను రాబట్టకపోయినప్పటికీ, సుదీర్ఘ కాలం పాటు జట్టును నడిపించే సామర్థ్యం అతడికి ఉందని జట్టు యాజమాన్యం నమ్ముతుంది. ఓపెనర్‌గా శుభ్‌మన్ చేసే పరుగులు జట్టుకు అత్యంత కీలకం అయ్యే ఛాన్స్ ఉంది.

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల ఫామ్ జట్టుకు ప్లస్ కానుంది. వన్డే ఫార్మాట్లో కోహ్లీ స్థిరత్వం, రోహిత్ దూకుడు 2027లోనూ టీమిండియాకు అవసరమని క్రికెట్ పండితులు పేర్కొంటున్నారు. వీరిద్దరూ ఫిట్‌నెస్ కాపాడుకుంటే తుది జట్టులో ఉండటం పక్కా.. మరోవైపు కేఎల్ రాహుల్ వికెట్ కీపర్‌గా, జస్ప్రీత్ బుమ్రా ప్రధాన బౌలర్‌గా టీమ్ కి బ్యాక్ బోన్ లా నిలిచే అవకాశం ఉంది.

టీమిండియా 2027 వరల్డ్ కప్ జట్టు అంచనా: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, రిషబ్ పంత్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా.

# 21 ఏళ్లకే క్రికెట్‌కి గుడ్ బై.. ఆర్సీబీ కొత్త ఛైర్మన్‌గా ఆర్యమన్ బిర్లా.. ఎలా సాధ్యమైందంటే!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలోనే ఓ సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. క్రికెట్ ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన టీమ్స్ లో ఒకటైన ఆర్సీబీ జట్టు చేతులు మారింది. ఆదిత్య బిర్లా గ్రూప్ ఆధ్వర్యంలోని కన్సార్టియం సుమారు 1.78 బిలియన్ డాలర్ల (రూ.16 వేల కోట్లకు)కి ఈ ఫ్రాంచైజీని కొనుగోలు చేసింది. బ్రిటన్‌కు చెందిన డయాజియో అనుబంధ సంస్థ 'యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్' నుంచి ఆర్సీబీ 100 శాతం వాటాను ఈ కన్సార్టియం దక్కించుకుంది. ఈ భారీ ఒప్పందంతో ఐపీఎల్ జట్ల విలువ ఒక్కసారిగా భారీగా పెరిగిపోయింది. ఈ మార్పు తర్వాత ప్రముఖ పారిశ్రామికవేత్త కుమార మంగళం బిర్లా కుమారుడు ఆర్యమన్ బిర్లా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు కొత్త ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్నారు. కాగా ఆర్యమన్ బిర్లా కేవలం వ్యాపార కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినే కాదు.. అతడికి క్రికెట్‌తో సంబంధం కూడా ఉంది. మధ్యప్రదేశ్ తరఫున ఫస్ట్-క్లాస్ క్రికెట్ ఆడిన అనుభవం ఆర్యమన్ కి ఉంది. ఈడెన్ గార్డెన్స్‌లో బెంగాల్ టీమ్ పై సెంచరీ చేసిన చరిత్ర అతడి పేరిట నమోదైంది. ప్రస్తుతం ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్‌తో కలిసి గతంలో అతడు డ్రెస్సింగ్ రూమ్ పంచుకున్నాడు. ఆర్సీబీ కొత్త ఛైర్మన్ ఆర్యమన్ బిర్లా ప్రయాణం చాలా ఇంట్రెస్టింగ్ గా కొనసాగింది. 2018 ఐపీఎల్ వేలంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు అతడ్ని రూ.30 లక్షలకు దక్కించుకుంది. కానీ అప్పుడు ఒక్క మ్యాచ్ కూడా ఆడే ఛాన్స్ రాలేదు.. దీంతో 2020లో తీవ్ర మానసిక ఒత్తిడితో క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యతం ఇస్తూ తనను తాను అర్థం చేసుకోవడానికి ఆ బ్రేక్ తీసుకున్న ఆర్యమన్ బిర్లా.. ఇప్పుడు తన తండ్రి వ్యాపార సామ్రాజ్యాన్ని ముందుకు నడిపిస్తున్నాడు. తాజాగా ఓ ఐపీఎల్ జట్టుని కొనుగోలు చేసి అధిపతిగా తిరిగి వచ్చాడు.

ఆర్సీబీ జట్టు కొనుగోలులో ద

ఆదిత్య బిర్లా గ్రూప్‌తో పాటు టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్, బోల్డ్ వెంచర్స్, బ్లాక్‌స్టోన్ ఇన్వెస్ట్‌మెంట్ గ్రూప్ పార్టనర్స్ గా ఉన్నాయి. క్రీడలు, మీడియా, వ్యాపార రంగాలలో ఉన్న అనుభవంతో ఆర్సీబీని ప్రపంచస్థాయిలో నెంబర్ వన్ గా నిలబెట్టాలని ప్లాన్ చేస్తున్నారు. ఆర్సీబీ ఎదుగుదలలో భాగస్వామి కావడం తన అదృష్టమని ఆర్యమన్ బిర్లా ఇంస్టాగ్రామ్ వేదికగా తెలియజేశాడు.

# రియాన్ పరాగ్‌కి రాజస్థాన్ రాయల్స్ బిగ్ షాక్.. కొత్త కెప్టెన్‌గా అతడే!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. 2026, మార్చి 24న ఈ జట్టు కొత్త యాజమాన్యం చేతిలోకి వెళ్లిపోయింది. ఇప్పటి వరకు మనోజ్ బదేలే నేతృత్వంలో ఉన్న ఈ ఫ్రాంచైజీని, కల్ సోమాని ఆధ్వర్యంలోని కన్సార్టియం కొనుగోలు చేసింది. గతంలో సుమారు రూ. 320 కోట్లకు కొనుగోలు చేసిన ఈ జట్టు, ఇప్పుడు ఏకంగా రూ. 15,280 కోట్లకు అమ్ముడైంది. ఇది ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన లావాదేవీలలో ఒకటిగా నిలిచింది.

**పూర్తి స్థాయి కెప్టెన్‌గా:**
యాజమాన్యంతో పాటు రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ కూడా మారారు. గత సీజన్ వరకు కెప్టెన్‌గా ఉన్న సంజూ శాంసన్, ట్రేడింగ్ ద్వారా చెన్నై సూపర్ కింగ్స్ కు వెళ్లడంతో.. రాజస్థాన్ యాజమాన్యం రియాన్ పరాగ్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. పరాగ్ గత సీజన్‌లో శాంసన్ అందుబాటులో లేనప్పుడు వైస్ కెప్టెన్‌గా జట్టును ముందుకు నడిపించాడు. ఈసారి పూర్తి స్థాయి కెప్టెన్‌గా వ్యవహరించబోతున్నాడు.

**జైస్వాల్ కి కెప్టెన్సీ పగ్గాలు:**
సోషల్ మీడియాలో రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్‌గా రియాన్ పరాగ్‌ను తొలగించి, యశస్వి జైస్వాల్‌ను నియమించనున్నట్లు వార్త కథనాలు వస్తున్నాయి. కానీ ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదు.. రాజస్థాన్ ఫ్రాంచైజీ కెప్టెన్సీ మార్పు గురించి ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. 2026, మార్చి 25 ముంబైలో జరిగిన ఐపీఎల్ కెప్టెన్ల ఫోటోషూట్‌లో కూడా రియాన్ పరాగ్ పాల్గొని, ట్రోఫీతో ఫోటోలకు ఫోజులిచ్చారు. అయితే జైస్వాల్ రాజస్థాన్ రాయల్స్ స్టార్ ప్లేయర్, భవిష్యత్తులో కెప్టెన్ అయ్యే అవకాశం ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి మాత్రం పరాగ్ కెప్టెన్‌గా కొనసాగుతున్నారు. ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు రాజస్థాన్ ఫ్రాంచైజీ జైస్వాల్‌ను రూ. 18 కోట్లకు, పరాగ్‌ను రూ14 కోట్లకు రిటైన్ చేసుకుంది.

**రాజస్థాన్ రాయల్స్ షెడ్యూల్:**
రియాన్ పరాగ్ నేతృత్వంలోని రాజస్థాన్ రాయల్స్ తమ ఐపీఎల్ 2026 ప్రయాణాన్ని మార్చి 30న చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగే మ్యాచ్‌తో ప్రారంభించనుంది. అనంతరం ఏప్రిల్ 4, 7, 10 తేదీలలో వరుసగా గుజరాత్ టైటాన్స్, ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లతో తలపడనుంది.

# సీనియర్ హీరోల యంగ్ స్ట్రాటజీ!

టాలీవుడ్ లో ఇప్పుడు ఒక సరికొత్త ట్రెండ్ నడుస్తోంది. ఒకప్పుడు సీనియర్ హీరోలు కేవలం అనుభవజ్ఞులైన దర్శకులతోనే పనిచేయడానికి మొగ్గు చూపేవారు. కానీ మారుతున్న ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా తమను తాము కొత్తగా ఆవిష్కరించుకోవడానికి సీనియర్ స్టార్లు యంగ్ డైరెక్టర్ల వైపు చూస్తున్నారు. ఈ యంగ్ స్ట్రాటజీ టాలీవుడ్‌లో సరికొత్త రికార్డులకు పునాది వేస్తోంది. మెగాస్టార్ చిరంజీవి ఈ విషయంలో ముందు వరుసలో ఉన్నారు. ఈ ఏడాది సంక్రాంతికి మన శంకర వరప్రసాద్ గారు చిత్రంతో 400 కోట్ల వసూళ్లు సాధించి బాక్సాఫీస్ వద్ద సత్తా చాటారు.తాజాగా చిరంజీవి దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఓ కల్ట్ చిత్రం చేయడానికి రెడీ అవుతున్నారు. దర్శకుడిగా శ్రీకాంత్ కు ఇది మూడవ చిత్రం మాత్రమే. అయినా అన్నయ్య ఎక్కడా వెనక్కి తగ్గలేదు. తన మార్క్ హిట్ ఇస్తాడు? అనే నమ్మకంతో ముందుకెళ్తున్నారు. ఈ చిత్రాన్ని నేచురల్ స్టార్ నాని సమర్పిచడం అన్నది మరో ఎత్తు. ఈ ఛాన్స్ తో చిరంజీవి కుర్ర హీరోలకు ఏమాత్రం తీసిపోని ఎనర్జీతో మరో సినిమా చేస్తున్నారని క్లారిటీ వచ్చేసింది. అలాగే నటసింహ నందమూరి బాలకృష్ణ కూడా పంథా మార్చుకున్నారు. వరుస హిట్లతో దూసుకుపోతున్న బాలయ్య తన 112వ సినిమా కోసం సరిపోదా శనివారం ఫేమ్ వివేక్ ఆత్రేయకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారంలో ఉంది.క్లాస్ కథలు రాసే వివేక్ ఆత్రేయ బాలయ్య కోసం ఓ పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ డ్రామాను సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ క్రేజీ కాంబినేషన్ 2027 సమ్మర్ కానుకగా విడుదలయ్యే అవకాశం ఉంది. బాలయ్య మాస్ ఇమేజ్‌కు వివేక్ ఇంటెలిజెంట్ స్క్రీన్‌ప్లే తోడైతే బాక్సాఫీస్ వద్ద జాతరే. అక్కినేని నాగార్జున తొలి నుంచి కొత్త దర్శకులను ప్రోత్సహించడంలో ముందుంటారు. తాజాగా తన ప్రతిష్టాత్మక 100వ సినిమా బాధ్యతలను కోలీవుడ్ యంగ్ డైరెక్టర్ కార్తీక్ తంగవేలుకు అప్పగించిన సంగతి తెలిసిందే. దర్శకుడిగా కార్తీక్ కి పెద్దగా అనుభవం లేదు. తొలి సినిమా కూడా భారీ విజయం సాధించింది లేదు.

కానీ నాగ్, కార్తీక్ కథను, మేకింగ్ ను నమ్మి ముందుకెళ్తున్నారు. ల్యాండ్ మార్క్ చిత్రాన్నే కార్తీక్ చేతుల్లో పెట్టారంటే యంగ్ మేకర్ ని కింగ్ ఎంతగా నమ్ముతున్నారు? అన్నది అద్దం పడుతుంది. నాగ్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోయే చిత్రమవుతుందని అభిమానులంతా కాన్ఫిడెంట్ గా ఉన్నారు. విక్టరీ వెంకటేష్ కూడా ఈ యంగ్ డైరెక్టర్ల రేసులో వెనుకబడలేదు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఆదర్శ కుటుంబం పూర్తి చేసిన వెంటనే తన ఫేవరెట్ డైరెక్టర్ అనిల్ రావిపూడితో మరోసారి చేతులు కలపనున్నారు. ఈ చిత్రంలో నందమూరి కళ్యాణ్ రామ్ కూడా ఒక కీలక పాత్రలో నటిస్తుండటం విశేషం.దగుబాటి - నందమూరి హీరోలను ఒకే తెరపై చూపించడం అనీల్ కు ఇదే తొలిసారి. 2027 సంక్రాంతికి ఒక క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌ను అందించబోతున్నారు. మొత్తానికి టాలీవుడ్ సీనియర్ హీరోలు తమ అనుభవాన్ని యంగ్ డైరెక్టర్ల కొత్త ఆలోచనలతో జోడించి బాక్సాఫీస్ వద్ద సునామీ సృష్టించేందుకు సిద్ధమయ్యారు. ఈ మార్పు కేవలం వసూళ్లకే కాకుండా తెలుగు సినిమా పరిధిని పెంచడానికి కూడా దోహదపడుతోంది.





**కర్లీ హెయిర్ మోడ్ ఆన్: ప్రకృతి పావని ఆత్మవిశ్వాసం & ఆకట్టుకునే అవతార్**



**బ్రౌన్ శాటిన్ గౌనులో ప్రణీత సుభాష్ టైమ్‌లెస్ గాంభీర్యాన్ని అందిస్తోంది**

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D. No. 41-1/5-1, Srinivasa Tower, Flat No. S2, Gowthami Nagar, Krishnalanka, Vijayawada, NTR Dist. editor GANTYADA APPARAO. PRGI Registration No. " APTEL/25/A4561" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965